



వాస్తవాలు పలుకు
TGTEL/26/A2635
# DD9 వార్త
తెలుగు దినపత్రిక

## 'పెద్ది' పైరసీకి అడ్డుకట్ట..
### మద్రాస్ హైకోర్టు కీలక ఉత్తర్వులు



04

హైదరాబాద్ | సంపుటి: 01 | సంచిక: 18 | 29-05-2026 శుక్రవారం | పేజీలు: 04 | వెల: 3/-

# రాయదుర్గం పాన్‌మక్తాలో రికార్డు ధరలు..

### ఎకరం రూ.237 కోట్లకు చేరిన భూమి వేలం



తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ భూముల వేలానికి అనూహ్య స్పందన

రాయదుర్గం ప్రాంతంలో భారీ పోటీతో పెరిగిన ధరలు

పాన్‌మక్తాలో ఎకరం రూ.237 కోట్లకు చేరిన రికార్డు ధర

గత ఏడాది ధరను అధిగమించిన తాజా వేలం

సర్వే నంబర్ 83/1లో 6 ఎకరాల 29 గుంటల భూమికి కొనసాగుతున్న వేలం

రియల్ ఎస్టేట్ రంగంలో పెరుగుతున్న పెట్టుబడుల ఆసక్తి

హైటెక్ కారిడార్ సమీప భూములకు భారీ డిమాండ్

వేలం ప్రక్రియలో పాల్గొన్న పలు ప్రముఖ సంస్థలు

గత అక్టోబర్‌లో ఎకరం రూ.177 కోట్లుగా నమోదైన ధర

రాజధాని పరిసరాల్లో భూమి విలువలు కొత్త శిఖరాలకు చేరిక

డిడి9 వార్త, హైదరాబాద్

హైదరాబాద్ నగరంలో తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన భూముల వేలానికి అనూహ్య స్పందన లభించింది. రాయదుర్గంలోని రాయదుర్గం పరిధిలోని పాన్‌మక్తా ప్రాంతంలో భూముల ధరలు రికార్డు స్థాయికి చేరాయి.ఇక్కడ నిర్వహించిన వేలంలో ఎకరం భూమి ధర రూ.237 కోట్లకు చేరినట్లు అధికారులు తెలిపారు. ఇది ఇప్పటివరకు ఆ ప్రాంతంలో నమోదైన అత్యధిక ధరగా నిలిచింది. గత ఏడాది అక్టోబర్‌లో ఇదే ప్రాంతంలో ఎకరం భూమి రూ.177 కోట్లకు పలికిన సంగతి తెలిసిందే. సర్వే నంబర్ 83/1లో ఉన్న మొత్తం 6 ఎకరాల 29 గుంటల భూమికి సంబంధించిన వేలం ఇంకా కొనసాగుతోంది. ఈ వేలంలో పలు సంస్థలు, పెట్టుబడిదారులు పాల్గొనడంతో పోటీ తీవ్రంగా ఉన్నట్లు సమాచారం. హైటెక్ సిటీకి సమీపంలో ఉన్న ఈ ప్రాంత భూములకు రియల్ ఎస్టేట్ రంగంలో భారీ డిమాండ్ ఉండటంతో ధరలు వేగంగా పెరుగుతున్నాయి. వేలం ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో మరింత రికార్డు ధరలు నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

# ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు కాంగ్రెస్ ఘనతే

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వెల్లడి

బక్రీద్ సందర్భంగా ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపిన మంత్రి

అల్లాపై విశ్వాసం, త్యాగనిరతి పండుగ సందేశమని వ్యాఖ్య

నల్గొండ మునుగోడు రోడ్డులోని ఈద్గాలో పాల్గొన్న మంత్రి

ముస్లిం సోదరులను కలిసి పండుగ విషెస్ తెలిపిన కోమటిరెడ్డి

బక్రీద్ మానవాళికి జీవన సందేశమని పేర్కొన్న మంత్రి

'భారత్ జోడో' యాత్రను ప్రస్తావించిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

అన్ని మతాలు సమానమనే సందేశం రాహుల్ గాంధీ యాత్రలో ఉందని వ్యాఖ్య

వైఎస్సార్ పాలనలో ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు అమలు అని గుర్తు

కాంగ్రెస్ సెక్యులర్ పార్టీకి ఇది ఉదాహరణ అని వ్యాఖ్య

నల్గొండ మతసామరస్యానికి గంగాజమునాతెహజీబ్ సాక్ష్యమని మంత్రి వ్యాఖ్య



డిడి9 వార్త, హైదరాబాద్

నల్గొండ పట్టణంలోని మునుగోడు రోడ్డు ఈద్గాలో బక్రీద్ సందర్భంగా ముస్లిం సోదరులను కలిసిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. అల్లా పట్ల ఉన్న అపారమైన విశ్వాసాన్ని, త్యాగనిరతిని చాటిచెప్పే గొప్ప పండుగ ఇదని మిగతా 2లో..

# దేశానికే తలమానికంగా ఫ్యూచర్ సిటీ

పనుల వేగాన్ని పరిశీలించిన మంత్రులు

విమర్శలపై మంత్రి శ్రీధర్ బాబు ధ్వజం

స్కిల్ యూనివర్సిటీ, ఎఫ్‌సీడీఏ భవన నిర్మాణాల పరిశీలన

భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా అత్యాధునిక మౌలిక వసతులు

సాంకేతిక పరిజ్ఞానంతో నగర రూపకల్పన

విద్య, నైపుణ్యాభివృద్ధి ద్వారా లక్షలాది మంది యువతకు ఉపాధి

ఉద్యోగ భద్రత కల్పించడమే ప్రధాన లక్ష్యం

ప్రపంచస్థాయి ప్రమాణాలతో రూపుదిద్దుకుంటున్న మెగా ప్రాజెక్టు

ప్రతిపక్షాలు కూడా సహకరించాలని పిలుపు

దిగ్గజ సంస్థల కార్యాలయాలకు కేంద్ర బిందువుగా మారనున్న నగరం

హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీస్తున్న ప్రతిపక్ష నేతలు

కేటీఆర్, హరీశ్ రావులపై మంత్రుల విమర్శలు



డిడి9 వార్త, హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఫ్యూచర్ సిటీ' ప్రాజెక్టు దేశానికే ఒక రోల్ మోడల్‌గా నిలిచేలా రూపుదిద్దుకుంటోందని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. గురువారం వారు ఫ్యూచర్ సిటీ పరిధిలో నిర్మాణ దశలో ఉన్న నూతన భవనాలను క్షేత్రస్థాయిలో సందర్శించారు. ముఖ్యంగా ఫ్యూచర్ సిటీ మిగతా 2లో..

# లోపాలుంటే సరిదిద్దుతాం

సీబీఎస్ఈ 'ఆన్‌స్క్రీన్' వివాదంపై కేంద్ర విద్యాశాఖ మంత్రి వివరణ

విద్యార్థుల భవిష్యత్తుపై రాజకీయం వద్దంటూ కీలక వ్యాఖ్యలు

తప్పులు జరిగితే తానే పూర్తి బాధ్యత వహిస్తానని ధర్మేంద్ర ప్రధాన్ వెల్లడి

మూల్యాంకనంలో ఎలాంటి అవకతవకలు జరిగినా కఠిన చర్యలకు హామీ

ఫలితాల అంశాన్ని రాజకీయ స్వార్థానికి వాడుకోవద్దని కేంద్ర మంత్రి విజ్ఞప్తి

మార్కులు, రీవ్యాల్యుయేషన్ ఆందోళనల్లో ఉన్న విద్యార్థులపై ఒత్తిడి

అంతర్జాతీయ ప్రమాణాలతో సరికొత్త డిజిటల్ మూల్యాంకన వ్యవస్థ తెచ్చినట్లు వెల్లడి

98 లక్షల జవాబు పత్రాలకు చెందిన 40 కోట్ల పేజీలను డిజిటలైజ్ చేసిన బోర్డు

ఓఎస్ఎం పోర్టల్‌లో ఎలాంటి సాంకేతిక లోపాలు లేవవన్న కేంద్ర మంత్రి

ఇది పూర్తిగా సురక్షితమైనదని సీబీఎస్ఈ వివరణ

తక్షణమే విచారణ జరిపి న్యాయం చేస్తామని ప్రకటన



డిడి9 వార్త, హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వ పరిధిలోని సీబీఎస్ఈ 12వ తరగతి బోర్డు పరీక్షల మూల్యాంకనం మరియు 'ఆన్‌స్క్రీన్ మార్కింగ్' విధానంపై దేశవ్యాప్తంగా వస్తున్న విమర్శలపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్పందించారు. నూతనంగా ప్రవేశపెట్టిన ఈ డిజిటల్ మూల్యాంకన ప్రక్రియ అత్యంత సురక్షితమైనదని, ఎంతో పటిష్టంగా రూపొందించబడిందని ఆయన స్పష్టం చేశారు. ఈ విధానం వల్ల విద్యార్థులకు ఎక్కడైనా నష్టం లేదా పొరపాట్లు జరిగి ఉంటే వాటిని తాము వెంటనే సరిచేస్తామని, అర్హులైన ప్రతి ఒక్క విద్యార్థికి పూర్తి న్యాయం జరిగేలా చూస్తామని భరోసా ఇచ్చారు. దిల్లీలో సీబీఎస్ఈ ఉన్నతాధికారులతో అత్యవసర సమీక్షా సమావేశాన్ని నిర్వహించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ పరీక్షల నిర్వహణ, ఫలితాల ప్రక్రియలో తలెత్తిన అసౌకర్యానికి కేంద్ర మంత్రిగా తానే మిగతా 2లో..

# మీరు డబ్బా ఇండ్లు కడుతున్నారు మేం డబల్ బెడ్రూం ఇండ్లు నిర్మించాం

హైదరాబాద్ లో లక్ష ఇళ్లు నిర్మించిన ఘనత బీఆర్ఎస్ పార్టీదే

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

కాంగ్రెస్ సవాళ్లకు కేటీఆర్ ఘాటు ప్రతిస్పందన

డబుల్ బెడ్‌రూం ఇళ్లపై రాజకీయ వాగ్వాదం

ఇందిరమ్మ ఇళ్ల హామీలపై కేటీఆర్ ప్రశ్నలు

ఆత్మగౌరవ గృహాల పేరుతో బీఆర్ఎస్ ఆత్మరక్షణ

రూ.70 వేల ఇళ్లపై కేటీఆర్ వ్యాఖ్యలు

హైదరాబాద్ ఇళ్ల నిర్మాణంపై ఘనత వాదన

ప్రజల ఇళ్ల కూల్చివేతలపై ఆరోపణలు

శ్వేతపత్రంపై సవాల్ విసిరిన కేటీఆర్

420 హామీల మోసం అంటూ విమర్శలు

కాంగ్రెస్–బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం తీవ్రతరం




డిడి9 వార్త, హైదరాబాద్

కాంగ్రెస్ నేతలు సవాళ్లు చేయడం, తర్వాత పారిపోవడం అలవాటుగా మారిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్లు లేని గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఓట్లు అడగదని, అలాగే డబుల్ బెడ్‌రూం ఇళ్లు లేని గ్రామాల్లో బీఆర్ఎస్ ఓట్లు అడగకూడదని ఇటీవల మంత్రి చేసిన సవాల్‌కు ఆయన ఘాటుగా స్పందించారు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై స్పందించిన కేటీఆర్, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు తీరును ప్రశ్నిస్తూ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. "ఆత్మగౌరవ గృహాలు కట్టిన ఆత్మగౌరవ పార్టీ మాది" అని పేర్కొన్న ఆయన, మిగతా 2లో..

# రాష్ట్రాల మధ్య సమన్వయం అవసరం

అప్పుడే అంతర్రాష్ట్ర జలవివాదాలు పరిష్కారం

పరిష్కారానికి సహకార ధోరణి తప్పనిసరి

రాష్ట్రాలకు ప్రధాని నరేంద్ర మోదీ సూచన

మధ్య జల సమస్యలపై సమన్వయ పద్ధతిని ప్రాధాన్యంగా తీసుకోవాలని సూచన

కెన్‌బెట్వా ప్రాజెక్టు దేశ జల అనుసంధానానికి నమూనాగా నిలవాలన్న ప్రధాని

రూ.30 వేల కోట్ల అభివృద్ధి పనుల పురోగతిపై సమగ్ర సమీక్ష

ప్రాజెక్టుల ఆలస్యంతో ఖర్చులు పెరుగుతున్నాయని ఆందోళన

సకాలంలో అనుమతులు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాలకు సూచన

డిజిటల్ సాంకేతికతతో ప్రాజెక్టుల పర్యవేక్షణపై దృష్టి

నదుల అనుసంధానం ద్వారా నీటి భద్రత సాధనపై చర్చ

స్వచ్ఛభారత్ అర్బన్ 2.0 అమలును వేగవంతం చేయాలని ఆదేశం

రూఫ్‌టాప్ సోలార్ వినియోగాన్ని విస్తరించాల్సిన అవసరం

కాల్వలపై సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు అవకాశాల పరిశీలన సూచన



డిడి9 వార్త, హైదరాబాద్

అంతర్రాష్ట్ర జల వివాదాలను రాజకీయ అంశంగా కాకుండా పరస్పర సహకారంతో పరిష్కరించుకోవాలని రాష్ట్రాలకు ప్రధాని నరేంద్ర మోదీ సూచించారు. దేశంలో నీటి వనరుల నిర్వహణ, అభివృద్ధి ప్రాజెక్టుల అమలు, పట్టణ మౌలిక సదుపాయాల పురోగతి వంటి కీలక అంశాలపై ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టుల అమలులో జరుగుతున్న ఆలస్యాలపై ఆయన తీవ్రంగా స్పందించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఈ సమీక్షలో ప్రధానంగా మధ్యప్రదేశ్-ఉత్తరప్రదేశ్ మధ్య అమలవుతున్న కెన్ బెట్వా రివర్ లింకింగ్ ప్రాజెక్ట్‌పై విస్తృతంగా చర్చ జరిగింది. ఈ ప్రాజెక్టు దేశంలో నదుల అనుసంధాన విధానానికి ఒక నమూనాగా మారాలని ప్రధాని అభిప్రాయపడ్డారు. దీని ద్వారా నీటి పంపిణీ అసమానతలను తగ్గించడమే కాకుండా, వ్యవసాయ రంగానికి స్థిరమైన సాగునీటి వనరులు అందించవచ్చని ఆయన పేర్కొన్నారు. రూ.30 వేల కోట్లకు పైగా విలువైన అభివృద్ధి పనుల పురోగతిని కూడా ఈ సమావేశంలో మిగతా 2లో..

## ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు
# కాంగ్రెస్ ఘనతే




**మొదటిపేజీ తరువాయి**

ఆయన వ్యాఖ్యానించారు. బక్రీద్ కేవలం మతపరమైన వేడుక మాత్రమే కాదని, ఇది మానవాళికి ఒక గొప్ప జీవన సందేశమని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు జరిగిన 'భారత్ జోడో' యాత్రను మంత్రి ప్రస్తావించారు. అన్ని వర్గాలు, అన్ని మతాల ప్రజలు సమానమని, అందరూ కలిసి మెలిసి ఉండాలనే గొప్ప సందేశంతో ఆ యాత్ర సాగిందని చెప్పారు.

అలాగే, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించడంతో విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరిగాయని తెలిపారు. కాంగ్రెస్ సెక్యులర్ పార్టీ అనడానికి ఇది ఒక ఉదాహరణ అని ఆయన పేర్కొన్నారు. నల్గొండలో మతసామరస్యానికి, గంగాజమునాతెహజీబ్‌కు నిలువెత్తు సాక్ష్యంగా నిలుస్తోందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అభిప్రాయపడ్డారు.

## మీరు డబ్బా ఇండ్లు కడుతున్నారు మేం డబల్ బెడ్రూం ఇండ్లు నిర్మించాం

**మొదటిపేజీ తరువాయి**

రాష్ట్ర సాధనతో పాటు గృహ స్వప్నాలను సాకారం చేసిన ఘనత తమదేనని అన్నారు. కేటీఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ నేతలు సవాళ్లు విసరడం, ఆ తర్వాత వాటి నుంచి తప్పించుకోవడం వారికి అలవాటుగా మారిందని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్లు లేని గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఓట్లు అడగదని, అలాగే డబుల్ బెడ్‌రూం ఇళ్లు లేని గ్రామాల్లో బీఆర్ఎస్ ఓట్లు అడగకూడదని ఇటీవల పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చేసిన సవాల్‌ను ఆయన ప్రస్తావించారు. కేటీఆర్ ఈ సవాల్‌కు స్పందిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం గృహ హామీల అమలులో విఫలమైందని ఆరోపించారు. "ఆత్మగౌరవ గృహాలు కట్టిన ఆత్మగౌరవ పార్టీ మాది. స్వరాష్ట్రాన్ని సాధించాం.. స్వగృహ స్వప్నాలను సాకారం చేశాం" అని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి, గృహ నిర్మాణ రంగంలో తమ ప్రభుత్వం చేసిన పనులను ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్ల అంశంపై మాట్లాడుతూ, "డబ్బా ఇళ్లు కాదు.. డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించాం" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన గృహాలను ఆయన సమర్థించుకుంటూ, వాటి నాణ్యత, విలువపై కాంగ్రెస్ చేస్తున్న విమర్శలను తిప్పికొట్టారు. ఒక్కో ఇల్లు రూ.70 వేలతో కట్టిన ఇళ్లు తమవి కావని, తాము కట్టిన ఇళ్లు అధిక విలువ, మెరుగైన నిర్మాణ ప్రమాణాలతో ఉన్నాయని అన్నారు. హైదరాబాద్ నగరంలో లక్ష డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించిన ఘనత తమ ప్రభుత్వానిదేనని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ ఇళ్ల నిర్మాణం పేదలకు గౌరవాన్ని ఇచ్చిందని, గృహ సమస్యల పరిష్కారంలో కీలక పాత్ర పోషించిందని ఆయన అన్నారు. ప్రభుత్వ గృహ పథకాలను విమర్శిస్తున్న వారు ముందుగా గతంలో జరిగిన అభివృద్ధిని అర్థం చేసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్లపై కూడా కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. "20 లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చాకే ఓట్లు అడుగుతామని ఛాలెంజ్ చేసిన మంత్రికి మాట నిలబెట్టుకునే దమ్ముందా?" అని ఆయన ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేయడం సరికాదని ఆయన ఆరోపించారు. "శపథం చేయడం కాదు.. చేతనైతే చేసి చూపించాలి" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన గృహ హామీలు వాస్తవంలో ఎంతవరకు అమలయ్యాయో ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని ఆయన అన్నారు. 20 లక్షల గృహ ప్రవేశాలు చేయించాకే ఓట్లు అడుగుతామని చేసిన సవాల్‌కు కట్టుబడి ఉండాలని ఆయన డిమాండ్ చేశారు. హైదరాబాద్ నగర అభివృద్ధి అంశాన్ని ప్రస్తావిస్తూ, గతంలో తమ ప్రభుత్వం చేపట్టిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాన్ని ఆయన సమర్థించుకున్నారు. నగరంలో నిర్మించిన ఇళ్ల సంఖ్య, వాటి నాణ్యతపై కాంగ్రెస్ ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని సవాల్ విసిరారు. అలాగే రెండున్నరేళ్లలో నగరంలో ఎన్ని ఇళ్లు కట్టారు, ఎన్ని ఇళ్లు కూల్చారు అనే వివరాలు ప్రజలకు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

ఈ సందర్భంలో ఆయన వివాదాస్పద వ్యాఖ్యలుగా మారిన అంశాన్ని ప్రస్తావించారు. "ప్రజల ఇండ్లు ప్రభుత్వం కూల్చి వికృతానందం పొందుతోంది" అని కేటీఆర్ ఆరోపించారు. గృహ సమస్యల పరిష్కారానికి బదులుగా ప్రభుత్వం ప్రజల ఇళ్లపై చర్యలు తీసుకుంటోందని ఆయన విమర్శించారు. ఈ అంశంపై శ్వేతపత్రం విడుదల చేసే ధైర్యం ఉందా అని ప్రశ్నించారు. కేటీఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను "420 హామీలు"గా అభివర్ణించారు. ప్రజలను ఆకర్షించేందుకు పెద్ద పెద్ద వాగ్దానాలు చేసి, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయకపోవడం మోసం కిందకే వస్తుందని ఆయన అన్నారు. ఈ మోసాన్ని ప్రజల ముందు ఎండగడతామని ఆయన హెచ్చరించారు.

డైవర్షన్ రాజకీయాలు, డ్రామాలతో ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం జరుగుతోందని ఆయన ఆరోపించారు. అయినప్పటికీ ప్రజల సమస్యలను, హామీల అమలును ఎవరూ దాచలేరని కేటీఆర్ స్పష్టం చేశారు. గృహ పథకాల అమలులో నిజాయితీ, పారదర్శకత అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. మొత్తంగా ఈ వ్యాఖ్యలతో రాష్ట్ర రాజకీయాల్లో కాంగ్రెస్-బీఆర్ఎస్ మధ్య గృహ పథకాలపై మాటల యుద్ధం మరింత తీవ్రతరమైంది. ఇళ్లు, హామీలు, అమలు తీరుపై ఇరు పార్టీల మధ్య రాజకీయ దూషణలు కొనసాగుతున్నాయి.



# రాష్ట్రాల మధ్య సమన్వయం అవసరం

**మొదటిపేజీ తరువాయి**

సమీక్షించారు. వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న ప్రాజెక్టుల్లో జాప్యం కారణంగా ఖర్చులు పెరుగుతున్నాయని, ఇది ప్రభుత్వ ఆర్థిక భారం పెంచడమే కాకుండా ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు ఆలస్యమవుతున్నాయని ప్రధాని ఆందోళన వ్యక్తం చేసినట్లు సమాచారం. ప్రాజెక్టుల అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని ప్రధాని స్పష్టం చేశారు. కేంద్ర-రాష్ట్ర స్థాయిలో సమన్వయం లేకపోవడం వల్ల పనులు నిలిచిపోతున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. సాంకేతికత ఆధారిత పర్యవేక్షణ వ్యవస్థలను విస్తృతంగా ఉపయోగించడం ద్వారా ఈ సమస్యలను అధిగమించవచ్చని ఆయన సూచించారు.

నీటి భద్రత అంశంపై ప్రత్యేక దృష్టి సారించిన ప్రధాని, నదుల అనుసంధానం, జల సంరక్షణ, భూగర్భ జలాల పునరుజ్జీవం వంటి కార్యక్రమాలను రాష్ట్రాలు ప్రాధాన్యంగా తీసుకోవాలని సూచించారు. ప్రతి రాష్ట్రం తమ ప్రాంతానికి అనుగుణంగా దీర్ఘకాలిక నీటి నిర్వహణ ప్రణాళికలను రూపొందించుకోవాలని ఆయన పేర్కొన్నారు. నగరాభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష సందర్భంగా స్వచ్ఛ భారత్ మిషన్ అర్బన్ 2.0 అమలును మరింత వేగవంతం చేయాలని ప్రధాని సూచించారు. పట్టణ ప్రాంతాల్లో ఘన వ్యర్థాల నిర్వహణకు శాస్త్రీయ పద్ధతులను అనుసరించాలని, మౌలిక సదుపాయాలను త్వరగా అందుబాటులోకి తేవాలని ఆయన ఆదేశించారు.

పర్యావరణ పరిరక్షణతో పాటు విద్యుత్ అవసరాలను తీర్చేందుకు రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థలను విస్తరించాల్సిన అవసరం ఉందని ప్రధాని పేర్కొన్నారు. గృహాలు, వాణిజ్య భవనాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో సౌర విద్యుత్ వినియోగాన్ని పెంచడం ద్వారా శక్తి స్వావలంబన సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. కాల్వల వెంబడి లేదా కాల్వలపై సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు అవకాశాలను కూడా పరిశీలించాలని ప్రధాని సూచించారు. భూవినియోగాన్ని తగ్గిస్తూ విద్యుత్ ఉత్పత్తిని పెంచే ఈ విధానం దేశానికి దీర్ఘకాలిక ప్రయోజనాలను అందిస్తుందని ఆయన పేర్కొన్నారు.

ప్రాజెక్టుల అమలులో ఆధునిక సాంకేతికత వినియోగంపై ప్రధాని ప్రత్యేకంగా దృష్టిసారించారు. రియల్ టైమ్ డేటా మానిటరింగ్, జియోట్యాగింగ్, డిజిటల్ ట్రాకింగ్ వంటి విధానాల ద్వారా పనుల పురోగతిని సమర్థవంతంగా పర్యవేక్షించవచ్చని ఆయన తెలిపారు. ఇది పారదర్శకతను పెంచడమే కాకుండా అవినీతి అవకాశాలను తగ్గిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. అంతర్రాష్ట్ర జల వివాదాల విషయంలో రాజకీయ ప్రయోజనాలకు అతీతంగా రాష్ట్రాలు కలిసి పని చేయాల్సిన అవసరం ఉందని ప్రధాని స్పష్టం చేశారు. దీర్ఘకాలిక పరిష్కారాలు సాధించాలంటే పరస్పర నమ్మకం, సహకారం కీలకమని ఆయన అన్నారు.

ప్రాజెక్టుల ఆలస్యం కారణంగా ప్రజలకు కలుగుతున్న అసౌకర్యంపై కూడా సమీక్షలో చర్చ జరిగింది. ప్రతి ప్రాజెక్టుకు స్పష్టమైన గడువు నిర్ణయించి, ఆ గడువులోనే పనులు పూర్తి చేయాలని ప్రధాని సూచించారు. లేకపోతే అభివృద్ధి లక్ష్యాలు సాధించలేమని ఆయన హెచ్చరించినట్లు సమాచారం. మొత్తంగా ఈ సమీక్షలో జల వనరుల నిర్వహణ, పట్టణాభివృద్ధి, పునరుత్పాదక శక్తి, ప్రాజెక్టు అమలు సామర్థ్యం వంటి అంశాలపై విస్తృత చర్చ జరిగింది. కేంద్ర-రాష్ట్ర సమన్వయం బలపడితేనే దేశ అభివృద్ధి వేగవంతమవుతుందని ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు.



# లోపాలుంటే సరిదిద్దుతాం

**మొదటిపేజీ తరువాయి**

పూర్తి బాధ్యత వహిస్తున్నానని, అయితే ఈ సున్నితమైన అంశాన్ని ప్రతిపక్షాలు రాజకీయ లబ్ధి కోసం వాడుకోవద్దని విజ్ఞప్తి చేశారు.

ఫలితాల అక్రమాలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన తీవ్ర ఆరోపణలను ధర్మేంద్ర ప్రధాన్ తోసిపుచ్చారు. డిజిటల్ ఇండియా ప్రయోగాలను, దేశంలో జరుగుతున్న శాస్త్రీయ పురోగతిని కొందరు కేవలం రాజకీయ కారణాలతోనే వ్యతిరేకిస్తున్నారని విమర్శించారు. ప్రస్తుతం విద్యార్థులు మార్కులు, వెరిఫికేషన్, రీ వ్యాల్యుయేషన్ వంటి విషయాలతో ఇప్పటికే తీవ్ర ఆందోళనలో ఉన్నారని, ఇటువంటి సమయంలో రాజకీయ ప్రకటనలు చేస్తూ వారిపై మరింత మానసిక ఒత్తిడిని పెంచడం సరికాదని హితవు పలికారు. రాజకీయాలు చేయడానికి భవిష్యత్తులో చాలా సమయం ఉంటుందని, కానీ ఇప్పుడు విద్యార్థుల మానసిక ఆరోగ్యానికి, వారి కెరీర్‌కు మొదటి ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం అందరిపై ఉందన్నారు. ఎక్కడైనా లోపాలు ఉంటే వాటిని సరిదిద్దేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందనే విషయాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు గమనించాలని కోరారు.

ఈ సందర్భంగా ఈ ఏడాది అమలు చేసిన ఆన్‌స్క్రీన్ మార్కింగ్ విధానం యొక్క విస్తృతిని మంత్రి వివరించారు. ఈసారి పరీక్షల్లో దేశవ్యాప్తంగా మొత్తం 98 లక్షల సమాధాన పత్రాల కాపీలను డిజిటల్ రూపంలోకి మార్చామని చెప్పారు. ఒక్కో సమాధాన పత్రంలో సగటున 40 పేజీల చొప్పున మొత్తం 40 కోట్ల పేజీలను హైరిజల్యూషన్‌తో స్కాన్ చేసి కంప్యూటర్ స్క్రీన్లపై మూల్యాంకనం కోసం ఉంచినట్లు తెలిపారు. ఈ ఓఎస్ఎం విధానం అనేది విద్యా వ్యవస్థను ఆధునీకరించే క్రమంలో వేసిన ఒక పెద్ద ముందడుగని, ఇప్పటికే అనేక అంతర్జాతీయ విద్యా సంస్థలు విజయవంతంగా దీనిని అమలు చేస్తున్నాయని గుర్తుచేశారు. విద్యార్థుల మార్కుల కేటాయింపులో ఎలాంటి అవినీతికి తావులేకుండా, అత్యంత పారదర్శకతను తీసుకురావాలనే మంచి ఉద్దేశంతోనే ఈ పద్ధతిని అమలులోకి తెచ్చామని ఆయన సమర్థించుకున్నారు.

మరోవైపు, ఈ డిజిటల్ వ్యవస్థపై వస్తున్న ఆరోపణలను సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ పూర్తిగా ఖండించింది. తాము వాడుతున్న ఈ మూల్యాంకన పోర్టల్‌లో ఎలాంటి సాంకేతిక లోపాలు లేదా సర్వర్ వైఫల్యాలు తలెత్తలేదని బోర్డు అధికారులు స్పష్టం చేశారు. జవాబు పత్రాల స్కానింగ్ మొదలుకుని వాటి ప్రాసెసింగ్, ఆన్‌లైన్ అప్‌లోడింగ్ వరకు ప్రతి ఒక్క ప్రక్రియను కఠినమైన భద్రతా నిబంధనల నడుమ నిర్వహించామని బోర్డు వివరించింది. కాగా, ఈ ఏడాది మే 13న విడుదలైన 12వ తరగతి ఫలితాలలో ఉత్తీర్ణత శాతం గతేడాదితో పోలిస్తే 3 శాతం తగ్గడంతో విద్యార్థుల్లో అసంతృప్తి మొదలైంది. కొత్తగా తెచ్చిన ఆన్‌స్క్రీన్ మార్కింగ్ విధానం వల్లే తమకు తక్కువ మార్కులు వచ్చాయని విద్యార్థులు ఆరోపించడంతో, బోర్డు వారికి జవాబు పత్రాల స్కాన్డ్ కాపీలను డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయాన్ని కల్పించింది.

అయితే, ఈ స్కాన్డ్ కాపీలను పరిశీలించిన కొందరు విద్యార్థులకు తమ సమాధాన పత్రాలు వేరొకరి వాటితో తారుమారైనట్లు వెల్లడైంది. ఢిల్లీకి చెందిన వేదాంత్ అనే విద్యార్థి తనకు వచ్చిన ఫిజిక్స్ (భౌతికశాస్త్రం) పేపర్ తనది కాదని అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, సంజన అనే విద్యార్థిని కూడా తన కెమిస్ట్రీ (రసాయనశాస్త్రం) పేపర్ స్థానంలో వేరొకరి సమాధాన పత్రం అప్‌లోడ్ అయిందని ఆధారాలతో ఫిర్యాదు చేసింది. ఇటువంటి కొన్ని నిర్దిష్టమైన మానవ తప్పిదాల వల్ల జరిగిన తారుమారు ఘటనలపై సీబీఎస్ఈ తక్షణమే స్పందించింది. ఆయా ఫిర్యాదులను ప్రత్యేకంగా పరిశీలిస్తున్నామని, ఎక్కడ పొరపాటు జరిగిందో గుర్తించి బాధ్యులైన సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని బోర్డు హామీ ఇచ్చింది. అర్హులైన విద్యార్థులకు మార్కులను సరిచేసి కొత్త మార్కు లిస్టులను అందజేస్తామని, ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని సీబీఎస్ఈ స్పష్టం చేసింది.



# దేశానికే తలమానికంగా 'ఫ్యూచర్ సిటీ'

**మొదటిపేజీ తరువాయి**

డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ) ప్రధాన కార్యాలయ భవన సముదాయంతో పాటు, యువతకు అత్యున్నత నైపుణ్య శిక్షణ అందించేందుకు ప్రతిపాదించిన యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ నిర్మాణ పనులను మంత్రులు నిశితంగా పరిశీలించారు. పనుల పురోగతిపై అక్కడి ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్ట్ సంస్థల ప్రతినిధులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఎక్కడా నాణ్యత విషయంలో రాజీ పడకుండా, అనుకున్న సమయానికి పనులన్నీ పూర్తి చేసి నగర నిర్మాణంలో వేగాన్ని పెంచాలని అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రాబోయే తరాల అవసరాలను, అంతర్జాతీయ మార్కెట్ డిమాండ్లను ముందే ఊహించి ఈ ఫ్యూచర్ సిటీని డిజైన్ చేసిందని చెప్పారు. ప్రపంచంలోనే ఏ దేశానికి, ఏ రాష్ట్రానికి రాని ఒక అద్భుతమైన ఆలోచన తమ ప్రభుత్వానికి వచ్చిందని, దీన్ని క్షేత్రస్థాయిలో విజయవంతం చేయడానికి అహర్నిశలు శ్రమిస్తున్నామని తెలిపారు. కేవలం భవనాలు కట్టడం మాత్రమే తమ ఉద్దేశం కాదని, ఇక్కడకు వచ్చే లక్షలాది మంది నిరుద్యోగులకు శాశ్వత ఉపాధి కల్పించడంతో పాటు వారికి పూర్తి స్థాయి ఉద్యోగ భద్రతను అందించడమే తమ ప్రభుత్వ ప్రధాన సంకల్పమని వివరించారు. దేశంలోనే అత్యుత్తమ సాంకేతిక ప్రమాణాలు, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలతో నిర్మిస్తున్న ఈ నగరం భారతదేశ కీర్తి కిరీటంలో ఒక తలమానికంగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రాభివృద్ధిని కాంక్షిస్తూ ప్రభుత్వం చేస్తున్న ఇటువంటి మంచి కార్యక్రమాలకు రాజకీయాలకు అతీతంగా ప్రతిపక్షాలు సైతం సహకరించాలని కోరారు.

మరో మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ ప్రతిపక్ష నేతలపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. బీఆర్ఎస్ నాయకులు కేటీఆర్, హరీశ్ రావులపై ఆయన ధ్వజమెత్తారు. ప్రభుత్వం ఏ మంచి పని చేసినా తప్పుడు ప్రచారాలు చేస్తూ, ఏది పడితే అది మాట్లాడటం వారికి అలవాటుగా మారిందని మండిపడ్డారు. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉన్న హైదరాబాద్ నగరం యొక్క అంతర్జాతీయ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీసేందుకు ఎవరు ప్రయత్నించినా, తెలంగాణ సమాజం ఊరుకోదని హెచ్చరించారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు చేసినా, ఎంతగా అడ్డుపడాలని చూసినా తాము మాత్రం తమ పనితనంతోనే సమాధానం చెబుతామని స్పష్టం చేశారు. ఫ్యూచర్ సిటీ అనేది కేవలం ఒక ప్రాంతానికే పరిమితం కాదని, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు ఉన్న మేజర్ గ్లోబల్ కంపెనీలన్నీ ఇక్కడి నుంచే తమ వ్యాపార సామ్రాజ్యాన్ని నడిపించేలా వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నామని చెప్పారు.

ఈ మెగా ప్రాజెక్టులో భాగంగా నిర్మిస్తున్న యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ద్వారా అంతర్జాతీయ స్థాయి విద్య, అధునాతన సాంకేతిక శిక్షణ స్థానిక విద్యార్థులకు అందుబాటులోకి వస్తాయని మంత్రులు వివరించారు. దీనివల్ల చదువు పూర్తి కాగానే యువతకు బహుళజాతి సంస్థల్లో నేరుగా ఉన్నత ఉద్యోగాలు లభిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. నగర పరిపాలన, మౌలిక వసతుల పర్యవేక్షణ కోసం ఏర్పాటు చేసిన ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ) కార్యాలయం అందుబాటులోకి వస్తే, పనుల సమన్వయం మరింత సులభతరం అవుతుందని అధికారులు తెలిపారు. భవిష్యత్తులో గ్రీన్ ఎనర్జీ, పర్యావరణ అనుకూల రవాణా వ్యవస్థల కలయికతో ఈ నగరం పచ్చదనానికి, ఆధునికతకు నిలయంగా మారుతుందని మంత్రులు పేర్కొన్నారు. ఈ పర్యటనలో మంత్రుల వెంట పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (టీజీఐఐసీ) ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్ మరియు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# తెలుగు ప్రజల ఆత్మగౌరవ ప్రతీక.. ఎన్టీఆర్

- **తెలుగు ప్రజల ఆత్మగౌరవ ప్రతీక.. ఎన్టీఆర్**
- **జిల్లా లో ఘనంగా ఎన్టీఆర్ 103వ జయంతి వేడుకలు**

**బోధన్, నిజామాబాద్ జిల్లా, మే 28(డీడీ9 వార్త) :**

"తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహనీయుడు నందమూరి తారక రామారావు.. ఆయన ఆశయాలే నేటి తరానికి దిక్సూచి" అని ప్రముఖులు కొనియాడారు. స్వర్గీయ ఎన్టీఆర్ 103వ జయంతిని పురస్కరించుకుని నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలో కమ్మ సంఘం ఆధ్వర్యంలో వేడుకలు మిన్నంటాయి. పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించిన అనంతరం వక్తలు ఆయన సేవలను స్మరించుకున్నారు. కమ్మ సంఘం అధ్యక్షుడు శివన్నారాయణ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాజకీయ, సినీ రంగ ప్రముఖులతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. రాజకీయ యవనికపై తెలుగువారి సత్తా చాటిన ఎన్టీఆర్, పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా చేపట్టిన సంక్షేమ పథకాలు నేటికీ ఆదర్శనీయమని వారు పేర్కొన్నారు.

**సేవలోనూ ఎన్టీఆర్ స్ఫూర్తి...**

వర్ని మండలంలోని శ్రీనగర్ గ్రామంలో రక్తదాన శిబిరం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించి ఎన్టీఆర్ సేవా స్ఫూర్తిని చాటిచెప్పారు. కోటగిరితో పాటు పరిసర గ్రామాల్లో కూడా అభిమానులు ఎన్టీఆర్ చిత్రపటాలకు నివాళులర్పించారు. ఎన్టీఆర్ చూపిన బాటలో నడుస్తూ సమాజహితానికి కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. జిల్లావ్యాప్తంగా జరిగిన ఈ సేవా కార్యక్రమాల్లో కమ్మ సంఘం సభ్యులు, అభిమానులు, యువజన సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.








# లక్ష్మీపూర్‌లో ఘనంగా టీఆర్ఎస్ జెండా పండుగ

- **మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావుకు గ్రామస్తుల ఘన స్వాగతం**
- **కార్యకర్తల్లో ఉత్సాహం నింపిన పార్టీ వేడుకలు**

**ఆదిలాబాద్ జిల్లా బ్యూరో : (డిడి 9 వార్త న్యూస్ )**

తలమడుగు మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో టీఆర్ఎస్ పార్టీ జెండా పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టి ఆర్ ఎస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామానికి చేరుకున్న ఆయనకు మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికగా, పార్టీ కార్యకర్తలు ఘనంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు మాట్లాడుతు గతంలో గ్రామానికి చేసిన అభివృద్ధిని గుర్తు చేసుకున్నారు. ఇందిరమ్మ ఇండ్ల కట్టి కట్టనట్టు సగం ఆగిపోయి ఉన్నాయి చాలా బిల్లులు కూడా ఆగిపోహి ఉన్నాయి అన్ని సమస్యలకు కృషి చేస్తానని తెలిపారు. తాగునీటి సమస్య పరిష్కారానికి అధికారులతో మాట్లాడతానని వెల్లడించారు. టీఆర్ఎస్ పార్టీ ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేసే పార్టీ అని పేర్కొన్నారు. గ్రామ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసి ప్రజల సమస్యల పరిష్కారానికి కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ ఆవిర్భావం నుంచి కార్యకర్తల త్యాగాలు, కష్టాల వల్లే టీఆర్ఎస్ ప్రజల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకుందని అన్నారు. రానున్న రోజుల్లో పార్టీ మరింత బలంగా ముందుకు సాగేందుకు ప్రతి కార్యకర్త కట్టుబడి పనిచేయాలని సూచించారు. జెండా పండుగ సందర్భంగా గ్రామంలో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో శివాజీ మరియు గ్రామ పటేల్ శాస్త్రి, సూర్య ప్రకాష్, రాజు, సుదర్శన్,మహేందర్ గ్రామ ప్రజలు పెద్దలు స్థానిక నాయకులు, మహిళా కార్యకర్తలు, యువకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మల్లెపూల సత్యనారాయణ సన్మానించిన ధనుర్ బి మున్నూరు కాపు సంఘం

**ఆదిలాబాద్ జిల్లా, బోథ్ మే 28 (డి డి 9 న్యూస్ ):-**

బోథ్ మార్కెట్ కమిటీ కార్యాలయంలో నూతనంగా మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి బాధ్యతలు స్వీకరించిన మున్నూరు కాపు ముద్దుబిడ్డ మల్లెపూల సత్యనారాయణ గారిని సన్మానించిన ధనుర్ బి మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు తోట నిఖిల్, అధిక మొత్తంలో మున్నూరు కాపులు వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారు కావున ఈ కమిటీ కి నిజమైన అర్హులకు పదవి వచ్చిందని సంతోషం వ్యక్తపరిచారు అలాగే రైతుల సమస్యపై ఈ యాసంగి సీజన్లో జొన్న కొనుగోలు పై ప్రత్యేక దృష్టితో లారీలను రప్పించి జొన్నలను గోదాములకు తరలిస్తామనిప్రభుత్వం యొక్క లక్ష్యాలను ప్రజల వద్దకు చేరుస్తామని చైర్మన్ గారు చెప్పారు. ఇకపై మునుముందు కూడా మండల సమస్యపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలియజేశారు అలాగే మున్నూరు కాపు సంఘం సభ్యులు ప్రణయ్, అశోక్, రాకేష్, రవి, భూమారెడ్డి, భీమ్ రెడ్డి, అరుణ్, ప్రణీత్ పాల్గొన్నారు. సహాయ సహకారాలు అందిస్తామని తెలియజేశారు



## ఉద్యోగం ఇప్పిస్తామంటూ యువకుడిని మోసం చేసిన వ్యక్తి పై కేసు నమోదు.

- **నకిలీ అపాయింట్మెంట్ ఆర్డర్ ఇచ్చి రూ.20 వేల వసూళ్లు.**
- **ఉద్యోగాల పేరుతో మోసం చేసే వారిపై అప్రమత్తంగా ఉండాలి.**
- **బోథ్ సిఐ డి గురుస్వామి**

**ఆదిలాబాద్ జిల్లా, బోథ్ మే 28(డి డి 9 న్యూస్ ):-**

బోథ్ మండలం పోచెర గ్రామానికి చెందిన అల్లాడి రాకేష్ అనే యువకుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మబలికి డబ్బులు వసూలు చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు బోథ్ పోలీస్ స్టేషన్ లో సీఐ డి గురు స్వామి తెలిపారు. ఫిర్యాదు ప్రకారం, నిర్మల్ జిల్లాకు చెందిన నిందితుడు పాలంకర్ గంగాధర్ స్కూల్లో కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి నకిలీ అపాయింట్మెంట్ ఆర్డర్ ఇచ్చి ఫోన్‌పే ద్వారా రూ.20,000/ వసూలు చేసినట్లు తెలిపారు. అనంతరం ఉద్యోగం ఇవ్వకుండా ఫోన్లు స్విచ్ ఆఫ్ చేసి మోసం చేసినట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు బోథ్ సీఐ తెలిపారు. ఉద్యోగాల పేరుతో డబ్బులు డిమాండ్ చేసే వ్యక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరైనా బాధితులు ఉంటే నిర్భయంగా జిల్లా పోలీసులను సంప్రదించవచ్చని తెలిపారు. ఉద్యోగాలు ఊరికే రావని ప్రభుత్వ ఉద్యోగాలు నోటిఫికేషన్ ద్వారా నింపబడతాయని సూచించారు. ఈ కార్యక్రమంలో బోథ్ ఎస్ఐ వి పురుషోత్తం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## కుతాడి శంకర్ సేవలు ప్రజలకు ఉపయోగపడాలి

- **మియాపురం శశికాంత్**

**బీర్కూర్, మే 28(డిడి9 వార్త):**

బీర్కూర్ మండలానికి చెందిన కుతాడి శంకర్ ఆత్మకమిటీ సభ్యుడిగా నూతనంగా ఎన్నుకోబడిన సందర్భంగా బీర్కూర్ యువనాయకుడు మియాపురం శశికాంత్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు.

ఈ సందర్భంగా మియాపురం శశికాంత్ మాట్లాడుతూ, కుతాడి శంకర్‌కు వచ్చిన ఈ బాధ్యత ప్రజలకు సేవ చేసే దిశగా మరింత ఉపయోగపడాలని ఆకాంక్షించారు. సమాజ సేవలో ముందుండి ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.కుతాడి శంకర్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ అందరికీ అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ యమ రాములు, ఉప సర్పంచ్ పరమేశ్ పంతులు, మాజీ ఎంపీపీ రఘు, మేకల విట్టల్,వార్డుమెంబర్ కొరిమె రఘు, ప్రశాంత్యు, అశోక్, సాత్యకిరణ్, పృధ్వి,అభిమానులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.



## ఇందూరు తిరుమలలో మహిళల ఆరోగ్య అవగాహన సదస్సు

**నిజామాబాద్ జిల్లా, మే 28(డీడీ9 వార్త) :**

నిజామాబాద్ నగరం నర్సింగపల్లిలోని ఇందూరు తిరుమల గోవింద వనమాల క్షేత్రంలో మాతృమూర్తుల ఆరోగ్యంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నారు. ప్రతి పౌర్ణమికి గర్భిణీ స్త్రీలకు దివ్య ఔషధ ప్రసాదాన్ని అందిస్తూ, శ్రీనివాసుని కృపతో వారి ఆరోగ్యానికి భరోసానిస్తున్న మా పల్లె చారిటబుల్ ట్రస్ట్, ఈసారి సమస్త మహిళల ఆరోగ్యంపై దృష్టి సారించింది. ఈ సందర్భంగా మా పల్లె చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు నరసింహ దాసు మాట్లాడుతూ, గర్భిణీ స్త్రీల నుండే కాకుండా, బాలికల నుంచి శతాధిక వృద్ధుల వరకు ప్రతి ఒక్కరూ తీసుకోవాల్సిన ఆహార నియమాలపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 12 ఏళ్ల బాలికల నుండి వృద్ధాప్యంలో ఉన్న మహిళల వరకు రోజువారీ ఆహారం, పోషకాహార విలువలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రముఖ పాకశాస్త్ర



నిపుణులు శ్రీమాన్ మిల్లెట్ రాంబాబు గారు కీలక సూచనలు చేస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ఈ నెల 30వ తేదీ శనివారం సాయంత్రం 6:30 గంటలకు ఇందూరు తిరుమల ఆలయంలో ప్రారంభమవుతుంది. రాత్రి 8 గంటల వరకు కొనసాగే ఈ సదస్సు అనంతరం, ఆలయంలో ప్రతి శనివారం నిర్వహించే విశేష ఏకాంత సేవ కార్యక్రమం కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.మాతృమూర్తులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నరసింహ దాసు కోరారు.



## సాలూరలో ఘనంగా బక్రీద్ వేడుకలు

**బోధన్, నిజామాబాద్ జిల్లా, మే 28(డీడీ9 వార్త) :**

సాలూర మండల కేంద్రంలో గురువారం బక్రీద్ పండుగను ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఈద్‌ఉల్‌అధా సందర్భంగా తెల్లవారుజామునే కొత్త దుస్తులు ధరించిన ముస్లింలు స్థానిక మసీదులు, ఈద్గాలకు తరలివచ్చారు. మత పెద్దల ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శాంతి, సౌభ్రాతృత్వం కోసం ప్రార్థించారు. ప్రార్థనల అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకుంటూ ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పండుగలో భాగంగా పేదలకు దానధర్మాలు చేస్తూ మానవత్వాన్ని చాటుకున్నారు. అనంతరం బంధుమిత్రులతో కలిసి విందు భోజనాలను ఆస్వాదించడంతో సాలూర ప్రాంతం పండుగ సందడితో కళకళలాడింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా, సామరస్యపూర్వకంగా పండుగ ముగియడంపై స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.





## నిజామాబాద్ లో పోలీస్ కమిషనర్ ఫుట్ పెట్రోలింగ్

**నిజామాబాద్ జిల్లా, మే 28(డీడీ9 వార్త) :**

బక్రీద్ పండుగను పురస్కరించుకుని నగరంలో శాంతి భద్రతలను పరిరక్షించేందుకు పోలీస్ యంత్రాంగం అత్యంత అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. ఈ క్రమంలో బుధవారం అర్ధరాత్రి నిజామాబాదు పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య స్వయంగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో కాలినడకన పర్యటించి భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. నగరంలోని ప్రధాన రహదారులు, రద్దీగా ఉండే, సున్నిత ప్రాంతాల్లో కమిషనర్ క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. విధుల్లో ఉన్న పోలీస్ అధికారులకు భద్రతా పరమైన కీలక సూచనలు జారీ చేశారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో పెట్రోలింగ్‌ను మరింత ముమ్మరం చేయాలని, అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలపై నిశిత నిఘా ఉంచాలని ఆదేశించారు. నగరంలోని సీసీ కెమెరాల నిఘాను సమర్థవంతంగా వినియోగించుకుంటూ, ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా శాంతియుత వాతావరణాన్ని కొనసాగించాలని స్పష్టం చేశారు. ప్రజలందరూ పండుగను సోదరభావంతో, సామరస్యంగా జరుపుకోవాలని పోలీస్ కమిషనర్ పిలుపునిచ్చారు. పౌరుల భద్రతే లక్ష్యంగా పోలీస్ శాఖ ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ ఫుట్ పెట్రోలింగ్ చంద్రశేఖర్ కాలనీ, గౌతమ్ నగర్, సుభాష్ నగర్, రాధాకృష్ణ థియేటర్, దుబ్బ, ఫ్లై ఓవర్ బ్రిడ్జి, దేవీ రోడ్, గాంధీ చౌక్, నెహ్రూ పార్క్, బోధన్ బస్టాండ్, నటరాజ్ థియేటర్, మాలపల్లి, అర్సపల్లి, కోజా కాలనీ, పవన్ థియేటర్, ఖిల్లా రోడ్, శాంతి నగర్ ఈద్గా, పెద్ద బజార్, లక్ష్మీ మెడికల్ వంటి కీలక ప్రాంతాల్లో సాగింది.






## నిజామాబాద్ జిల్లాలో శాంతియుతంగా బక్రీద్ వేడుకలు

**నిజామాబాద్ జిల్లా, మే 28(డీడీ9 వార్త) :**

బక్రీద్ పండుగను జిల్లావ్యాప్తంగా ప్రశాంత వాతావరణంలో జరుపుకునేందుకు పోలీస్ శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్లలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. ఈ మేరకు బందోబస్తు ఏర్పాట్లను నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయిచైతన్య స్వయంగా పర్యవేక్షించారు. గురువారం బోధన్ పట్టణంలోని నర్సి రోడ్డు ఈద్గా వద్ద చేపట్టిన భద్రతా ఏర్పాట్లను కమిషనర్ పరిశీలించారు. అనంతరం నిజామాబాద్ నగరంలోని శాంతినగర్ ఈద్గా వద్దకు చేరుకుని అక్కడ జరుగుతున్న పనులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈద్గా పరిసరాల్లో ట్రాఫిక్ నియంత్రణ, భక్తుల రాకపోకలు, పార్కింగ్ సదుపాయాలు మరియు సీసీ కెమెరాల పనితీరుపై అధికారులకు పలు సూచనలు చేశారు. పండుగకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని ఆయన ఆదేశించారు. పండుగ వేళ ప్రజలు పరస్పర సహకారంతో సామరస్యంగా వేడుకలు జరుపుకోవాలని కమిషనర్ పిలుపునిచ్చారు. ఎక్కడైనా అనుమానాస్పద వ్యక్తులు లేదా అవాంఛనీయ సంఘటనలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (అడ్మిన్) శుభం ప్రకాష్, బోధన్ ఏసీపీ శ్రీనివాస్, సీటీసీ ఏసీపీ రాజశేఖర్, నిజామాబాద్ ఏసీపీ ప్రకాష్, హోంగార్డ్ ఏసీపీ దీపక్ చంద్ర, బోధన్ టౌన్ ఎస్హెచ్ఓ వెంకట్ నారాయణ, ఇతర సీఐలు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.





## ఐకేపీ వీవోఏల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

**బోధన్, నిజామాబాద్ జిల్లా, మే 28(డీడీ9 వార్త) :**

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఐకేపీ వీవోఏలు చేపట్టిన సమ్మె నాలుగో రోజుకు చేరుకున్న నేపథ్యంలో బోధన్ పట్టణంలోని ఐకేపీ కార్యాలయం వద్ద జరుగుతున్న ఆందోళనకు వికలాంగుల హక్కుల జాతీయ వేదిక నిజామాబాద్ జిల్లా కమిటీ మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన నిరసన కార్యక్రమంలో ఎన్‌పీఆర్‌డీ జిల్లా అధ్యక్షులు గైని రాములు, జిల్లా కార్యదర్శి ఏశాల గంగాధర్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరిని వీడి, సమ్మె చేస్తున్న వీవోఏలతో వెంటనే చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రజాసంఘాల మద్దతుతో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. వీవోఏలపై ఉన్న పని భారాన్ని తగ్గించాలని, నెలకు కనీస వేతనం రూ. 26వేలు చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. అర్హులైన వారికి సీసీలుగా పదోన్నతులు కల్పించడంతో పాటు, ఉద్యోగ భద్రత కల్పించాలని, 58 జీవోను సవరించాలని కోరారు. వీవోఏలకు సెర్ప్ ఉద్యోగులుగా గుర్తింపునిస్తూ ప్రమాద భీమా, ఆరోగ్య భీమా కింద రూ. 20 లక్షలు అందించాలని అందరికీ పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు వెంకటేష్, రమేష్, పోశెట్టి, నరేష్, లక్ష్మి, కృష్ణవేణి, గోదావరి, గంగభవాని, రాజమణి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ చక్రేశ్వర శివ మందిర దుకాణం లీజు వేలం పాట వాయిదా

**బోధన్,నిజామాబాద్ జిల్లా,మే 28(డీడీ9వార్త):**

బోధన్ పట్టణంలోని శ్రీ చక్రేశ్వర శివ మందిరానికి చెందిన దుకాణ సముదాయం లీజు లైసెన్స్ వేలం పాట వాయిదా పడినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి రాములు తెలిపారు. ఆలయానికి సంబంధించిన దుకాణాన్ని రెండు సంవత్సరాల కాలానికి లీజుకు ఇచ్చేందుకు గురువారం వేలం పాటను ఏర్పాటు చేశారు. అయితే వేలం పాటలో పాల్గొనేందుకు పాటదారులు ఎవరూ హాజరుకాకపోవడంతో, నిర్వహించాల్సిన వేలం పాటను వాయిదా వేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. తదుపరి లీజు లైసెన్స్ వేలం పాట నిర్వహించే తేదీని త్వరలోనే అధికారికంగా ప్రకటిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు బీర్కూరు బుజ్జి, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## నేడు రైతులు సకాలంలో యూరియా బుకింగ్ చేసుకోవాలి

**బోధన్, నిజామాబాద్ జిల్లా, మే 28(డీడీ9 వార్త) :**

సాలూర మండలంలోని రైతులకు అవసరమైన యూరియాను ఆన్‌లైన్ యాప్‌లో అందుబాటులో ఉంచినట్లు ఏవో శ్వేత తెలిపారు. ఈ మేరకు శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు యాప్‌లో యూరియా బస్తాలు అప్‌లోడ్ అవుతాయని చెప్పారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, ఆన్‌లైన్ ద్వారా బుకింగ్ చేసుకోవాలని ఆమె సూచించారు. సమాచారం తెలియని రైతులకు తోటి రైతులు తెలియజేయాలని కోరారు. ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకున్న రైతులు సకాలంలో బస్తాలను తీసుకువెళ్లాలని ఏవో కోరారు.

## రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేయాలి : డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్

**హైదరాబాద్,మే 28,(డిడి9 వార్త):**

రైతులు చెమటోడ్చి పండించిన పంటను కాంగ్రెస్ ప్రభుత్వం సరైన సమయంలో కొనుగోలు చేయకపోవడంతో అకాల వర్షాలకు పంట తడిసి ముద్దవై రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారని టీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని ఆయన విమర్శించారు. రైతులు రాత్రింబవళ్లు కష్టపడి పండించిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రోజుల తరబడి పేరుకుపోయి వర్షాలకు తడిసి నష్టపోతున్న పరిస్థితి చాలా దారుణమని అన్నారు.

రైతుల శ్రమకు తగిన గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. తడిసిన ధాన్యాన్ని కూడా ప్రత్యేక చర్యలతో కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలని కోరారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా రైతులు తీవ్ర ఆర్థిక నష్టాల్లో కూరుకుపోతున్నారని, వెంటనే కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేసి రైతులకు మద్దతుగా నిలవాలని డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు.




# ప్రొఫెసర్ నాగేశ్వరరావు వ్యాఖ్యలపై తెలంగాణ జనసైనికుల ఆగ్రహం

- **పవన్ కళ్యాణ్‌పై వ్యాఖ్యలు దురుద్దేశపూరితమని విమర్శలు**
- **అమిత్ షా – పవన్ చర్చలపై ఆధారాలు లేని ఆరోపణలంటూ మండిపాటు**
- **జర్నలిస్టుగా బాధ్యత మరిచి వ్యవహరించారని ఆరోపణ**
- **తెలంగాణ – ఆంధ్ర మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నమని విమర్శ**
- **కొండగట్టు ఆలయ అభివృద్ధికి పవన్ సహకారం గుర్తు చేసిన నాయకులు**
- **రెండు రాష్ట్రాల్లో పవన్‌కు కోట్లాది అభిమానులు ఉన్నారన్న తనీష్**
- **“హైదరాబాద్‌లో తిరగనివ్వం” అన్న వ్యాఖ్యలపై సాగర్ ఫైర్**


తనీష్ అల్లాడి


ఆర్ కె సాగర్


నందగిరి సతీష్






జనసేన రాష్ట్ర వీర మహిళ విభాగం చైర్మన్ మండపాక కావ్య

**హైదరాబాద్,మే 28,(డిడి9 వార్త):**

జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పై ప్రొఫెసర్ నాగేశ్వరరావు చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ముఖ్యంగా తెలంగాణ జనసైనికులు ఈ వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఘాటుగా స్పందించారు.

అమిత్ షా వద్ద పవన్ కళ్యాణ్, నాదెండ్ల మనోహర్‌లు జగన్ అరెస్టు చెయ్యాలని కోరగా అందుకు కేంద్ర హోంమంత్రి అమిత్షా కుదరదన్నట్లుగా ప్రొఫెసర్ నాగేశ్వరరావు యూట్యూబ్ ఛానల్‌లో చేసిన విశ్లేషణ పై జనసైనికుల్లో తీవ్ర ఆగ్రహాన్ని రేకెత్తించింది. ఎలాంటి ఆధారాలు లేకుండా ఊహాగానాలతో ప్రజలను తప్పుదోవ పట్టించడం సరికాదని వారు మండిపడ్డారు.

ఒక జర్నలిస్టుగా బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన వ్యక్తి ఛానల్ వ్యూస్, డబ్బు కోసం ఇతరులపై అవమానకర వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని విమర్శించారు. అమిత్ షా - పవన్ కళ్యాణ్ మధ్య సంభాషణ పక్క రూమ్ లో రికార్డింగ్ పెట్టి విన్నట్లుగా తానే ప్రత్యక్ష సాక్షిలా మాట్లాడటం నాగేశ్వరరావు దిగజారుడు తనమని జనసేన రాష్ట్ర నాయకులు సీని నటుడు తనీష్ అన్నారు.

తెలంగాణ - ఆంధ్ర ప్రజల మధ్య విభేదాలు సృష్టించే విధంగా వ్యాఖ్యలు చేయడం సమాజానికి హానికరమని పేర్కొన్నారు

పవన్ కళ్యాణ్‌కు రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ కోట్లాది అభిమానులు ఉన్నారని,తెలంగాణ ప్రజలు ఎప్పుడూ తనవారిగానే భావించిన నాయకుడిపై తప్పుడు ప్రచారం చేయడం దురుద్దేశపూరితమని విమర్శించారు.పవన్ కళ్యాణ్ కి తెలంగాణ లో పడుతున్న ప్రజలు పడుతున్న బ్రహ్మరథాన్ని చూసి భయపడి ఇలాంటి లేని పోనీ అభాండాలు వేస్తున్నారని అన్నారు

ఇక “పవన్ కళ్యాణ్‌ను హైదరాబాద్‌లో తిరగనివ్వం” అంటూ కొందరు చేసిన వ్యాఖ్యలపై “మొగలిరేకులు” ఫేమ్ నటుడు సాగర్ ఘాటుగా స్పందించారు. “ఎవరికైనా దమ్ముంటే ఆపి చూపించండి. ప్రజా సమస్యలపై పోరాడితే మేమూ మీతో కలిసి వస్తాం. కానీ చిల్లర రాజకీయాలు చేయొద్దు” అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

కొండగట్టు అంజన్న ఆలయ అభివృద్ధికి పవన్ కళ్యాణ్ భారీగా నిధులు అందించిన విషయాన్ని గుర్తు చేస్తూ, ఆయన ఎప్పుడూ ప్రాంతీయ విభజన భావనతో రాజకీయాలు చేయలేదని తెలంగాణ జనసేన రాష్ట్ర ఇంచార్జ్ నేమూరి శంకర్ గౌడ్ అన్నారు.

రాజ్యాంగ హక్కులు తెలుసుకుని మాట్లాడాలని, తెలంగాణలో జనసేన పార్టీ మరింత బలంగా ఎదగబోతుందని సాగర్ అన్నారు. పవన్ కళ్యాణ్ అభిమానులు ఇప్పటివరకు ఓర్పుతో ఉన్నారని, దాన్ని చేతకానితనంగా భావిస్తే తగిన పరిణామాలు తప్పవని హెచ్చరించారు.

ఇదిలా ఉండగా, బుధవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ప్రొఫెసర్ నాగేశ్వరరావుకు మద్దతుగా తెలంగాణ క్రాంతి దళ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశం కూడా వివాదాస్పదంగా మారింది. ఆ సమావేశంలో పవన్ కళ్యాణ్‌పై చేసిన వ్యాఖ్యలు ప్రపంచవ్యాప్తంగా ఉన్న అభిమానులను తీవ్రంగా బాధించాయని జనసేన నేతలు పేర్కొన్నారు.

“తెలంగాణ మీద ఆంధ్ర ఇనుప గుడ్లు” అనే శీర్షికతో బ్యాగ్రౌండ్ పోస్టర్ ఏర్పాటు చేసి మాట్లాడటం ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టే ప్రయత్నమని విమర్శించారు. అసలు ఈ అంశాన్ని తెరపైకి తీసుకొచ్చింది ప్రొఫెసర్ నాగేశ్వరరావేనని అన్నారు

మాజీ ముఖ్యమంత్రి జగన్ ప్రభుత్వాన్ని కూలదోసి, ప్రధాని మోడీ, చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడటంలో పవన్ కళ్యాణ్ కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. పవన్ కళ్యాణ్ ఎప్పుడూ తెలంగాణకు వ్యతిరేకంగా మాట్లాడలేదని, ప్రాంతీయతను దాటిన జాతీయవాదమే జనసేన పార్టీ సిద్ధాంతమని జనసేన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నందగిరి సతీష్ అన్నారు అదే విధంగా ఆయన మాట్లాడుతూ, “మేమూ ఇదే తెలంగాణ గడ్డపై పుట్టాం. అవసరమైతే మీకంటే గట్టిగా మాట్లాడగలం. కానీ మా నాయకుడు పవన్ కళ్యాణ్ మాకు సంస్కారం, ఓర్పు నేర్పించారు. అందుకే దిగజారి మాట్లాడడం మాకు రాదు” జనసేన రాష్ట్ర వీర మహిళ విభాగం చైర్మన్ మండపాక కావ్య వ్యాఖ్యానించారు

# లైకులు, ఫాలోవర్లే ఎర.. రీల్స్ చేసే యువతకు పాక్ గూఢచార సంస్థ వల!

- **సోషల్ మీడియా రీల్స్ చేసేవారిని లక్ష్యంగా చేసుకున్న ఐఎస్ఐ**
- **లైకులు, ఫాలోవర్లు పెంచుతామని చెప్పి ఉచ్చులోకి లాగుతున్న వైనం**
- **సున్నితమైన సమాచారం సేకరించమని ఒత్తిడి, బ్లాక్‌మెయిల్**
- **ఇటీవల యూపీ యువకుడి అరెస్ట్‌తో వెలుగులోకి వచ్చిన కుట్ర**
- **'ఆపరేషన్ సిందూర్' తర్వాత భారత్‌పై గూఢచర్యాన్ని పెంచిన పాక్**

**డిడి9 వార్త:**

భారత్‌లో గూఢచర్యం కోసం పాకిస్థాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐ సరికొత్త, ప్రమాదకరమైన మార్గాన్ని ఎంచుకుంది. సోషల్ మీడియాలో పాప్యులారిటీ, లైకులు, ఫాలోవర్ల కోసం రీల్స్ చేసే యువతనే లక్ష్యంగా చేసుకుని వారిని గూఢచర్యం ఉచ్చులోకి లాగుతోంది. ఈ విధంగా దేశానికి సంబంధించిన అత్యంత సున్నితమైన సమాచారాన్ని రాబడుతోంది. గత ఏడాది కాలంలో ఇలాంటి గూఢచర్యం కేసుల్లో అరెస్టుల సంఖ్య గణనీయంగా పెరిగిందని భారత నిఘా వర్గాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

పాకిస్థాన్‌లో ఉన్న కొందరు ఐఎస్ఐ హ్యాండ్లర్లు, రిక్రూటర్లు సోషల్ మీడియాలో చురుగ్గా ఉండే, రీల్స్ చేసే వారిని నిరంతరం గమనిస్తుంటారు. వీరు వందల కొద్దీ నకిలీ ఖాతాలను సృష్టించి, లక్ష్యంగా చేసుకున్న వారి రీల్స్‌కు లైకులు, కామెంట్లు పెడుతూ ఎంగేజ్‌మెంట్ పెంచుతారు. నెమ్మదిగా వారితో సంభాషణలు మొదలుపెట్టి, మరింత మంది ఫాలోవర్లను అందిస్తామని నమ్మిస్తారు. ఈ ఆశకు చాలామంది యువత సులభంగా లొంగిపోతున్నారని ఓ ఇంటెలిజెన్స్ బ్యూరో అధికారి తెలిపారు.

మొదట వారిని ఏమి చేయాలో చెప్పకుండా, కేవలం కొన్ని నిర్దిష్ట ప్రదేశాల్లో వీడియోలు తీసి పంపమని అడుగుతారు. అమాయకంగా వారు ఆ ఆదేశాలను పాటిస్తారు. ఆ తర్వాత చిన్న మొత్తంలో డబ్బు ఆశ చూపి, దేశ భద్రతకు సంబంధించిన కీలక ప్రదేశాలు, సైనిక కార్యకలాపాల గురించి సమాచారం ఇవ్వాలని కోరతారు. విషయం గ్రహించే లోపే వారు గూఢచర్యం ఉచ్చులో పూర్తిగా చిక్కుకుంటారు. ఇదివరకే పెద్ద ఇన్‌ఫ్లుయెన్సర్లను డబ్బుతో ఆకర్షించిన ఐఎస్ఐ, ఇప్పుడు చిన్న రీల్స్ మేకర్లను 'ఎంగేజ్‌మెంట్' ఎరగా వాడుకుంటోందని అధికారులు చెబుతున్నారు.

ఇటీవల తెలంగాణ పోలీసులు అరెస్ట్ చేసిన ఉత్తరప్రదేశ్ వాసి జైద్ ఖాన్ కేసు దీనికి స్పష్టమైన నిదర్శనం. సోషల్ మీడియాలో నిత్యం రీల్స్ పోస్ట్ చేసే జైద్‌ను రాణా హుస్సేన్, అవిద్ అనే ఇద్దరు వ్యక్తులు అనుసరించడం ప్రారంభించారు. అతని పోస్టులకు ఎంగేజ్‌మెంట్ పెంచడంతో వారి కోసం పనిచేయడానికి అంగీకరించాడు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి



ఆదిత్యనాథ్ వ్యక్తిగత సహాయకుడి మొబైల్ నంబర్, ఇతర క్యాబినెట్ మంత్రుల వివరాలు సేకరించాలని అతడిని ఆదేశించారు. దీనికి ప్రతిఫలంగా అతనికి ఒక పిస్టల్ ఇస్తామని కూడా హామీ ఇచ్చారు.భారత సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' తర్వాత భారత్ చేతిలో ఎదురైన పరాభవంతో పాకిస్థాన్ ప్రతీకారంతో రగిలిపోతోందని, భారత సైనిక రహస్యాలను తెలుసుకుని మన బలగాలను ఇబ్బంది పెట్టాలనే లక్ష్యంతో గూఢచర్యాన్ని ముమ్మరం చేసిందని అధికారులు చెబుతున్నారు. రీల్స్‌పై ఉన్న మోజుతో చాలామంది యువత తాము చేస్తున్న పని తీవ్రతను గ్రహించడం లేదని, ఈ బలహీనతనే ఐఎస్ఐ పూర్తిగా వాడుకుంటోందని నిఘా ఏజెన్సీలు స్పష్టం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో కేవలం ఇన్‌ఫ్లుయెన్సర్లపైనే కాకుండా సాధారణ రీల్స్ మేకర్ల సోషల్ మీడియా ఖాతాలపై కూడా ఇప్పుడు నిఘా పెంచారు.

# వెల్‌డన్ వైభవ్.. యువ సంచలనాన్ని అభినందించిన కావ్య మారన్..

- ఐపీఎల్ ఎలిమినేటర్‌లో 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ విధ్వంసం
- 29 బంతుల్లో 97 పరుగులతో అద్భుత ఇన్నింగ్స్
- మ్యాచ్ అనంతరం వైభవ్‌ను ప్రత్యేకంగా అభినందించిన కావ్య మారన్
- ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్
- వైభవ్ అరుదైన టాలెంట్ అంటూ కితాబిచ్చిన ఎస్ఆర్‌హెచ్ కోచ్

**డిడి9 వార్త:**

ఐపీఎల్ 2026 ఎలిమినేటర్‌లో రాజస్థాన్ రాయల్స్ (ఆర్ఆర్) యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ అద్భుత ప్రదర్శనతో అదరగొట్టాడు. నిన్న సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్)తో జరిగిన మ్యాచ్‌లో కేవలం 29 బంతుల్లో 97 పరుగులు చేసి విధ్వంసం సృష్టించాడు. ఈ 15 ఏళ్ల కుర్రాడి అసాధారణ ఆటతీరు ప్రత్యర్థి జట్టు యాజమాన్యాన్ని సైతం ఆకట్టుకుంది. ముఖ్యంగా ఎస్ఆర్‌హెచ్ సహ యజమాని కావ్య మారన్ చూపిన క్రీడా స్ఫూర్తి అందరినీ ఆకట్టుకుంది.

మ్యాచ్ అనంతరం కావ్య మారన్ స్వయంగా వైభవ్ వద్దకు వెళ్లి అతడిని ప్రత్యేకంగా అభినందించారు. యువ ఆటగాడితో కరచాలనం చేసి, ప్రశంసలు కురిపించారు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ప్రత్యర్థి జట్టు ఆటగాడిని ప్రోత్సహించిన కావ్య తీరుపై నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు.

**ఇలాంటి టాలెంట్‌ను చూడలేదు: జేమ్స్ ఫ్రాంక్లిన్**

మరోవైపు ఎస్ఆర్‌హెచ్ అసిస్టెంట్ కోచ్ జేమ్స్ ఫ్రాంక్లిన్ సైతం వైభవ్‌పై ప్రశంసల వర్షం కురిపించాడు. మ్యాచ్ అనంతరం ఫ్రాంక్లిన్ మాట్లాడుతూ.. "బహుశా ఇలాంటి టాలెంట్‌ను ఎవరూ చూసి ఉండరు. అతను చేస్తున్నది నమ్మశక్యంగా లేదు. అతనికి ఇంకా 25 ఏళ్ల కెరీర్ మిగిలి ఉందని ఊహించుకుంటేనే భయంగా ఉంది. భవిష్యత్తులో అతను మరింత మెరుగవుతాడు. మరింత బలంగా తయారవుతాడు" అని చెప్పుకొచ్చాడు.



# 'కొత్త సిక్సర్ల మెషిన్' వైభవ్.. కచ్చితంగా ఆ మార్కును అందుకుంటావు

- ఐపీఎల్‌లో కొత్త సిక్సర్ల రికార్డు సృష్టించిన వైభవ్ సూర్యవంశీ
- ఒకే సీజన్‌లో 65 సిక్సర్లతో క్రిస్ గేల్ రికార్డు బ్రేక్
- వైభవ్ ఐపీఎల్‌కు దొరికిన కొత్త సిక్సర్ల మెషిన్ అంటూ యూనివర్సల్ బాస్ ప్రశంస
- ఎలిమినేటర్‌లో 29 బంతుల్లో 97 పరుగుల విధ్వంసక ఇన్నింగ్స్

**డిడి9 వార్త:**

ఐపీఎల్‌లో యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ కొత్త చరిత్ర సృష్టించాడు. రాజస్థాన్ రాయల్స్ (ఆర్ఆర్) తరఫున ఆడుతున్న 15 ఏళ్ల యువ బ్యాటర్.. టీ20 క్రికెట్ దిగ్గజం క్రిస్ గేల్ పేరిట ఉన్న పలు రికార్డులను బద్దలు కొట్టి అందరి దృష్టిని ఆకర్షించాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్)తో జరిగిన కీలక ఎలిమినేటర్ మ్యాచ్‌లో వైభవ్ కేవలం 29 బంతుల్లో 5 ఫోర్లు, 12 సిక్సర్లతో 97 పరుగులు చేసి విధ్వంసం సృష్టించాడు. 334కు పైగా స్ట్రైక్ రేట్‌తో సాగిన ఈ ఇన్నింగ్స్‌తో అతను ఒకే ఐపీఎల్ సీజన్‌లో అత్యధిక సిక్సర్లు బాదిన ఆటగాడిగా నిలిచాడు. ఈ సీజన్‌లో మొత్తం 65 సిక్సర్లు కొట్టిన వైభవ్, 2012లో క్రిస్ గేల్ నెలకొల్పిన 59 సిక్సర్ల రికార్డును అధిగమించాడు. ఇది ఏ టీ20 టోర్నమెంట్‌లోనైనా ఒకే సీజన్‌లో అత్యధిక సిక్సర్ల రికార్డు కావడం విశేషం.

వైభవ్ ప్రదర్శనపై క్రిస్ గేల్ స్వయంగా స్పందించి ప్రశంసలు కురిపించాడు. ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టులో.. "అద్భుతం వైభవ్ సూర్యవంశీ, ఐపీఎల్‌కు దొరికిన కొత్త సిక్సర్ల మెషిన్" అని అభినందించాడు. కేవలం 3 పరుగుల తేడాతో శతకం చేజార్చుకోవడంపై స్పందిస్తూ.. "నువ్వు దురదృష్టవంతుడివి. కానీ, కచ్చితంగా ఆ మార్కును అందుకుంటావు" అని ప్రోత్సహించాడు.

**ఐపీఎల్‌లో కొత్త సిక్సర్ల కింగ్.. వైభవ్ సూర్యవంశీ!**

ఈ సీజన్‌లో వైభవ్ సూర్యవంశీ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. మొత్తం 15 ఇన్నింగ్స్‌లలో 45.33 సగటు, 242.85 స్ట్రైక్ రేట్‌తో 680 పరుగులు సాధించాడు. ఇందులో ఒక శతకం, నాలుగు అర్ధశతకాలు ఉన్నాయి. తన పరుగుల్లో 88.9 శాతాన్ని కేవలం ఫోర్లు, సిక్సర్లతోనే సాధించి, 2019లో ఆండ్రీ రస్సెల్ (85.5%) నెలకొల్పిన రికార్డును కూడా వైభవ్ బద్దలు కొట్టాడు. అంతేగాక ఒకే ఐపీఎల్ ఇన్నింగ్స్‌లో 10కి పైగా సిక్సర్లు బాదిన సందర్భాల్లో గేల్ (4 సార్లు) రికార్డును సమం చేయడమే కాకుండా, ఒకే సీజన్‌లో మూడుసార్లు ఈ ఘనత సాధించిన తొలి బ్యాటర్‌గా నిలిచాడు. కేవలం 15 ఏళ్ల వయసులోనే అసాధారణ ప్రతిభతో, వైభవ్ సూర్యవంశీ భారత క్రికెట్ భవిష్యత్తుకు ఓ కొత్త ఆశాకిరణంగా కనిపిస్తున్నాడు.



# 15 ఏళ్లకే కోట్లకు పడగెత్తిన వైభవ్... ఆస్తి ఎంతో తెలుసా?

- 15 ఏళ్లకే క్రికెట్‌లో సంచలనంగా మారిన వైభవ్ సూర్యవంశీ
- రూ.10 కోట్లకు పైగా చేరిన నికర ఆస్తి
- ముంబైలో ఖరీదైన ఫ్లాట్, లగ్జరీ కార్లు, కోట్ల రూపాయల కాంట్రాక్టులు
- స్పాన్సర్‌షిప్‌ల ద్వారా భారీగా పెరుగుతున్న సంపాదన

**డిడి9 వార్త:**

ప్రస్తుతం భారత క్రికెట్ ప్రపంచంలో 15 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ పేరు మారుమోగిపోతోంది. ఐపీఎల్ 2026 ఎలిమినేటర్ మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ (ఆర్ఆర్) తరఫున సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) పై కేవలం 29 బంతుల్లో 97 పరుగులు చేసి అందరి దృష్టినీ ఆకర్షించాడు. ఈ అద్భుత ప్రదర్శన తర్వాత అతని సంపాదన, నికర ఆస్తిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. చిన్న వయసులోనే ఈ యువ కెరటం రూ.10 కోట్లకు పైగా ఆస్తిని కూడబెట్టడం విశేషం.

**ఐపీఎల్ ద్వారా కోట్ల ఆదాయం**

2025 మెగా వేలంలో రాజస్థాన్ రాయల్స్ జట్టు వైభవ్‌ను రూ.1.1 కోట్లకు కొనుగోలు చేసింది. రెండో ఏడాది కూడా అదే మొత్తాన్ని జీతంగా అందుకుంటున్నాడు. దీంతో రెండేళ్లలో అతని ఐపీఎల్ జీతం రూ.2.2 కోట్లకు చేరింది. దీనికి అదనంగా ఆడిన ప్రతి మ్యాచ్‌కు రూ.7.5 లక్షల మ్యాచ్ ఫీజు లభిస్తుంది. ఇప్పటివరకు 22 మ్యాచ్‌లు ఆడిన వైభవ్‌కు కేవలం మ్యాచ్ ఫీజుల రూపంలోనే సుమారు రూ.1.65 కోట్లు అందాయి. అతని అద్భుత ఆటతీరు చూస్తుంటే, వేలంలో చెల్లించిన మొత్తం చాలా తక్కువ అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**ఆస్తులు.. ఖరీదైన బహుమతులు**

క్రికెట్ ఆదాయంతో పాటు వైభవ్‌కు విలువైన ఆస్తులు కూడా ఉన్నాయి. ముంబైలో సుమారు రూ.2.5 కోట్ల నుంచి రూ.3 కోట్ల విలువ చేసే విలాసవంతమైన అపార్ట్‌మెంట్‌ను అతను కొనుగోలు చేశాడు. బీహార్‌లోని సమస్తిపూర్ జిల్లా తాజ్‌పూర్‌లో ఉన్న అతని పూర్వీకుల ఇంటి విలువ కూడా రూ.40 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు ఉంటుందని అంచనా.

2025 ఐపీఎల్‌లో అత్యధిక స్ట్రైక్ రేట్ సాధించినందుకు బహుమతిగా రూ.17 లక్షల విలువైన టాటా కర్వ్ ఈవీ కారును గెలుచుకున్నాడు. రాజస్థాన్ రాయల్స్ సహ యజమాని రంజిత్ బర్తకూర్ అతనికి మెర్సిడెస్ బెంజ్ కారును బహుమతిగా ఇచ్చినట్లు సమాచారం. 2026 అండర్ 19 ప్రపంచ కప్ ఫైనల్‌లో అద్భుత ప్రదర్శన కనబరిచినందుకు అప్పటి బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ నుంచి రూ.50 లక్షల నగదు బహుమతి కూడా అందుకున్నాడు.



**స్పాన్సర్‌షిప్‌లతో రెట్టింపు ఆదాయం**

ఐపీఎల్ జీతం, మ్యాచ్ ఫీజులు, ఆస్తులు, బహుమతుల విలువ కలిపి సుమారు రూ.7 కోట్లుగా ఉన్నప్పటికీ, వైభవ్‌కు పెరుగుతున్న స్పాన్సర్‌షిప్ ఒప్పందాలు అతని నికర ఆస్తిని గణనీయంగా పెంచుతున్నాయి. వివిధ బ్రాండ్లకు అంబాసిడర్‌గా వ్యవహరించడం ద్వారా వస్తున్న ఆదాయంతో అతని మొత్తం నికర ఆస్తి విలువ రూ.10 కోట్లు దాటి ఉంటుందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. కేవలం 15 ఏళ్ల వయసులోనే ఈ స్థాయిలో సంపాదించడం అతని ప్రతిభకు, భవిష్యత్తుకు నిదర్శనంగా నిలుస్తోంది.

# అసలు రాజస్థాన్ జట్టులోకి వైభవ్ సూర్యవంశీ ఎలా వచ్చాడో తెలుసా?.. ఆ ఇంట్రెస్టింగ్ స్టోరీ ఇదే!

- దేశవాళీ క్రికెట్‌లో వైభవ్ ప్రతిభను గుర్తించిన ఆర్ఆర్ స్కౌట్ సమర్ ఖాద్రీ
- ఆర్ఆర్ స్కౌటింగ్ హెడ్ జుబిన్ భరుచా ఏర్పాటు చేసిన ట్రయల్స్‌కు హాజరైన వైభవ్
- ట్రయల్స్‌లో ఎదుర్కొన్న తొలి బంతినే సిక్సర్‌గా మలిచి అందరినీ ఆశ్చర్యపరిచిన వైనం
- వైభవ్‌ను 'జనరేషనల్ టాలెంట్' అని అభివర్ణించిన జుబిన్
- అతని కోసం రూ.10 కోట్లు సిద్ధం చేయాలని ఆర్ఆర్ యాజమాన్యానికి మెసేజ్

**డిడి9 వార్త:**

ఐపీఎల్‌లో కొత్త ప్రతిభను గుర్తించి, ప్రోత్సహించడంలో రాజస్థాన్ రాయల్స్ (ఆర్ఆర్) జట్టు ఎప్పుడూ ముందుంటుంది. సంజూ శాంసన్, యశస్వి జైస్వాల్ వంటి ఎందరో యువ సంచలనాలను వెలుగులోకి తెచ్చిన ఆర్ఆర్... తాజాగా మరో యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీని ఎలా గుర్తించిందనే ఆసక్తికర కథనం వెలుగులోకి వచ్చింది.

రాజస్థాన్ రాయల్స్ స్కౌటింగ్ బృందంలో సభ్యుడైన సమర్ ఖాద్రీ, దేశవాళీ క్రికెట్‌లో వైభవ్ సూర్యవంశీ ఆటను తొలిసారి గమనించాడు. ఓ లోకల్ మ్యాచ్‌లో వైభవ్ అమాంతం వరుస సిక్సర్లు బాదాడం చూశాడు. అతని అసాధారణ ప్రతిభకు ముగ్ధుడయ్యాడు. ఈ విషయాన్ని వెంటనే ఆర్ఆర్ స్కౌటింగ్ హెడ్ జుబిన్ భరుచా దృష్టికి తీసుకెళ్లాడు. దీంతో జుబిన్, వైభవ్ కోసం ప్రత్యేకంగా ఒక ట్రయల్ ఏర్పాటు చేశాడు.

ఈ ట్రయల్స్‌లో ఊహించని సంఘటన చోటు చేసుకుంది. వైభవ్ ఎదుర్కొన్న మొట్టమొదటి బంతినే సిక్సర్‌గా మలిచి అందరినీ ఆశ్చర్యపరిచాడు. గతంలో సంజూ శాంసన్, యశస్వి జైస్వాల్ కూడా ఆర్ఆర్ ట్రయల్స్‌లో తమ తొలి బంతికే సిక్సర్లు బాదడం విశేషం. ఈ అద్భుతమైన ప్రదర్శన చూసి జుబిన్ భరుచా అవాక్కయ్యాడు. వెంటనే అతను ఆర్ఆర్ యాజమాన్యానికి ఒక సందేశం పంపాడు. "వేలానికి రూ.10 కోట్లు సిద్ధం చేయండి. మన ముందుకు ఒక 'జనరేషనల్ టాలెంట్' వస్తున్నాడు" అని అందులో పేర్కొన్నాడు. ఈ ఒక్క సంఘటనతో వైభవ్ ప్రతిభపై ఆర్ఆర్ యాజమాన్యానికి ఎంతటి నమ్మకం ఏర్పడిందో స్పష్టమవుతోంది.



# ఐపీఎల్ ఎలిమినేటర్‌లో సన్‌రైజర్స్ ఘోర పరాజయం.. మైదానంలో కన్నీరు పెట్టుకున్న కావ్య మారన్!

- ఐపీఎల్ 2026 నుంచి సన్‌రైజర్స్ హైదరాబాద్ ఔట్
- ఎలిమినేటర్‌లో రాజస్థాన్ చేతిలో ఘోర పరాజయం
- సూర్యవంశీ విధ్వంసకర బ్యాటింగ్, ఆర్చర్ బౌలింగ్‌కు ఎస్ఆర్‌హెచ్ కుదేలు
- కావ్య గత ప్రవర్తనను గుర్తు చేస్తూ సోషల్ మీడియాలో ట్రోలింగ్

**డిడి9 వార్త:**

ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ (SRH) ప్రయాణం ముగిసింది. బుధవారం ముల్లాన్‌పూర్ వేదికగా రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన కీలక ఎలిమినేటర్ మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు ఘోర పరాజయం పాలైంది. భారీ అంచనాలతో బరిలోకి దిగిన ఆరెంజ్ ఆర్మీ.. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో పూర్తిగా తేలిపోయి టోర్నీ నుంచి నిష్క్రమించింది. జట్టు ఓటమిని తట్టుకోలేక ఎస్ఆర్‌హెచ్ యజమాని కావ్య మారన్ మైదానంలోనే కన్నీటిపర్యంతమయ్యారు.



ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ రాయల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 243 పరుగుల భారీ స్కోరు సాధించింది. రాజస్థాన్ యువ సంచలనం, 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ కేవలం 29 బంతుల్లో 97 పరుగులు చేసి సన్‌రైజర్స్ బౌలింగ్‌ను ఛిన్నాభిన్నం చేశాడు. కెప్టెన్ పాట్ కమిన్స్ వ్యూహాలేవీ అతడి ముందు ఫలించలేదు. అనంతరం 244 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన హైదరాబాద్‌ను రాజస్థాన్ పేసర్ జోఫ్రా ఆర్చర్ తన పేస్ బౌలింగ్‌తో దెబ్బతీశాడు. పవర్‌ప్లేలోనే కీలక వికెట్లు కోల్పోయి హైదరాబాద్ ఒత్తిడిలో పడింది. నితీశ్‌రెడ్డి (38) కాసేపు పోరాడినా ఫలితం లేకపోయింది. చివరికి 192 పరుగులకే పరిమితమై ఎస్ఆర్‌హెచ్ ఓటమిని అంగీకరించింది.

కాగా, ఈ ఓటమి తర్వాత కావ్య మారన్‌పై సోషల్ మీడియాలో, ముఖ్యంగా చెన్నై సూపర్ కింగ్స్ (CSK) అభిమానుల నుంచి ట్రోలింగ్ మొదలైంది. లీగ్ దశలో చెన్నైపై గెలిచినప్పుడు కావ్య అతిగా సంబరాలు చేసుకున్నారని, "గెలిచినప్పుడు వినయంగా ఉండాలి" అంటూ పాత వీడియోలను షేర్ చేస్తూ చురకలు అంటిస్తున్నారు. టైటిల్ ఫేవరెట్‌గా బరిలోకి దిగిన హైదరాబాద్ ఇలా అనూహ్యంగా టోర్నీ నుంచి వైదొలగడం అభిమానులను తీవ్ర నిరాశకు గురిచేసింది.

DD9 Vaartha
శుక్రవారం
29-05-2026
హైదరాబాద్

# ఇదంతా పబ్లిసిటీ కోసం కాదు!



వేరే పరిశ్రమకి వెళ్లినప్పుడు అక్కడి స్థానిక భాష మాట్లాడటం చాలా ముఖ్యమని, ఇదంతా పబ్లిసిటీ కోసం కాదని అంటోంది అందాల తార శ్రీలీల. భాషతో సంబంధం లేకుండా ప్రేక్షకుల్ని అలరించే ఈ భామ.. తన డ్యాన్స్‌తో కుర్రకారుని ఉర్రూతలూగిస్తోంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఈమె వివిధ ప్రాంతాల ప్రేక్షకులతో కనెక్ట్ అవ్వడం గురించి మాట్లాడింది. "నా విషయానికొస్తే... నేను ప్రతి భాషను గౌరవిస్తాను. పలు చిత్రపరిశ్రమల్లో అవకాశాలు అందుకుంటూ పనిచేస్తున్నా... కాబట్టి ఒక ప్రాంతానికి వెళ్లినప్పుడు తప్పకుండా అక్కడి భాషలోనే మాట్లాడతా. ఆ ప్రదేశానికి, అక్కడి భాషకు, ప్రజలకు ఇచ్చే గౌరవం అది. సినీతారలకు, ప్రేక్షకులకు మధ్య భాష ఒక భావోద్వేగ వారధిలాగా ఉంటుంది. అందుకే ప్రచార కార్యక్రమాల్లో స్థానిక భాషల్లో మాట్లాడటం వల్ల వారి మధ్య దూరం తగ్గుతుందనేది నా అభిప్రాయమ"ని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఆమె హిందీలో కార్తిక్ ఆర్యన్‌తో ఓ ప్రేమకథా చిత్రంతో పాటు ధనుష్ నటిస్తున్న మరో సినిమాలో నాయికగా నటిస్తుంది

# ఈ ప్రయాణంలో మీకు మీరే స్నేహితులు



కళా రంగమే కాదు.. మీరు ఎంచుకున్న ఏ ప్రపంచంలోనైనా మీ ప్రయాణం వ్యక్తిగతమైనదే అంటోంది కథానాయిక ఐశ్వర్య రాయ్. ఇటీవలే ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె చిత్రపరిశ్రమలో రాణించాలనుకున్నప్పుడు వ్యక్తిత్వానికి ఇవ్వాల్సిన ప్రాధాన్యత గురించి తన అభిప్రాయాన్ని పంచుకుంది. "నటిగా ఇప్పటికీ ప్రతిరోజు కొత్తగానే భావిస్తాను. సృజనాత్మకతతో కూడిన ఈ ప్రపంచంలో మనల్ని మనం వెతుక్కునే నిరంతర ప్రయాణం ఇది. అలాంటిది ఎవరికో సలహాలు ఇచ్చేంత గొప్ప స్థానంలో నేను ఉన్నానని అనుకోను. ప్రేక్షకులు నాపై చూపే ప్రేమ, ఆదరాభిమానాలకు ఎల్లప్పుడూ కృతజ్ఞురాలినే. కానీ, కళా రంగమే కాదు.. ఎంచుకున్న ఏ ప్రపంచంలోనైనా మీ ప్రయాణం వ్యక్తిగతమైనది. మీ అనుభవాలే మీకు జీవితంలో ఎలాంటి నిర్ణయాలు తీసుకోగలరో తెలుసుకునేందుకు సహాయపడతాయి. ఎందుకంటే ఒక్కొక్కరిది ఒక్కో రకమైన దృష్టి కోణం. నేను చెప్పాలని అనుకున్నదల్లా ఒక్కటే.. ఇప్పుడున్న పరిస్థితుల్లో మీ చుట్టూ ఏం జరుగుతుందో మీరు ఊహించలేరు. ప్రతి విషయాన్ని ఒక ప్రణాళికతో కృత్రిమంగా చేయడానికే ఎక్కువ మంది ఇష్టపడుతున్నారు. నిజమో కాదో తెలుసుకునేలోపే అంతా జరిగిపోతుంది. యువతరం ఇలాంటి వాటిని చూసి పక్కదారి పట్టకూడదు. బయటకు వెళ్లండి. మీ అభిరుచిని తెలుసుకోండి. మీ నిర్ణయాలతో నిజాయతీగా మెలగండి. ఆ ప్రయాణంలో మీకు మీరే మంచి స్నేహితులుగా నిలబడాలి. ఈ నకిలీ ప్రపచంలో ఫన్, మ్యాజిక్‌లతో పాటు ఒక వ్యక్తి ఏం చేయగలడో అనే వాటిని అన్వేషించేడంలో ఆనందం ఉండదు. ముందు సజీవంగా ఉండి జీవితాన్ని అర్థం చేసుకోవాలి. ఆ తర్వాత ఆ అనుభూతిని మీ కళలోకి తీసుకురావాలి. మీరు ఎవరనే దానికి నిజాయతీగా ఉండండి. అలానే నిత్య విద్యార్థిగా ఉంటూ మీతో మీరు నిజాయతీగా ఉండండి. సొంత అనుభవాలే మిమ్మల్ని ఒక మంచి నటుడిగా తీర్చిదిద్దుతాయి. వాటన్నింటినీ స్వీకరిస్తూ మీ ప్రయణాన్ని సాగించాలి. మిగిలినవన్నీ జరగాల్సిన సమయానికి అవే జరిగిపోతాయి, రావాల్సినవి వస్తాయి" అని చెప్పింది.

# 'పెద్ది' పైరసీకి అడ్డుకట్ట.. మద్రాస్ హైకోర్టు కీలక ఉత్తర్వులు

'పెద్ది' సినిమా పైరసీకి అడ్డుకట్ట వేసేందుకు మద్రాస్ హైకోర్టు కీలక ఉత్తర్వులిచ్చింది. ఈ సినిమాకు యాంటీపైరసీ ఇంజంక్షన్ జారీ చేసింది. సినిమా కాపీరైట్‌కు సంబంధించి చిత్ర నిర్మాణ సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారించిన హైకోర్టు వెకేషన్ బెంచ్ ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. ఈ సినిమాను (Peddi) ఇంటర్నెట్‌లో అక్రమంగా అప్‌లోడ్ చేయడం, ప్రసారం చేయడం, కాపీ చేయడాన్ని నిరోధిస్తూ న్యాయస్థానం ఈ ఆదేశాలిచ్చింది. సినిమా అనధికారికంగా ఇంటర్నెట్‌లో లీక్ అయితే నిర్మాతలకు భారీ నష్టం వాటిల్లుతుందని కోర్టు ఈ సందర్భంగా అభిప్రాయపడింది.

'యాంటీ పైరసీ ఇంజంక్షన్' (AntiPiracy Injunction) అనేది కాపీరైట్ హక్కుదారులు తమ కంటెంట్ (సినిమాలు, వెబ్‌సిరీస్‌లు) అక్రమంగా కాపీ కాకుండా, పైరసీ వెబ్‌సైట్లలో ప్రసారం కాకుండా కోర్టుల ద్వారా పొందే ఒక న్యాయ పరమైన రక్షణ ఉత్తర్వు. ఒక వెబ్‌సైట్‌ను బ్లాక్ చేసిన వెంటనే, కొత్త యూఆర్ఎల్‌తో అదే కంటెంట్ రాకుండా కొత్త సైట్‌లను కూడా ఆటోమెటిక్‌గా బ్లాక్ చేయడానికి ఈ 'డైనమిక్ ఇంజంక్షన్' (Dynamic Injunction) ఉత్తర్వులను కోర్టులు జారీ చేస్తుంటాయి.

గతకొంత కాలంగా ఇండస్ట్రీని పైరసీ భూతం వెంటాడుతోన్న విషయం తెలిసిందే. ఇటీవల కూడా విజయ్ 'జననాయగన్' విడుదలకు ముందే నెట్టింట ప్రత్యక్షమైంది. ఇలాంటివి జరగకుండా 'పెద్ది' టీమ్ ముందడుగు వేయడంపై అందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. రామ్ చరణ్ (Ram Charan) హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కిన 'పెద్ది' జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే విడుదలైన ట్రైలర్, పాటలు దీనిపై అంచనాలు పెంచేశాయి.






# స్వాతంత్ర్య దినోత్సవం స్పెషల్‌గా రాబోతున్న 'విశ్వనాథ్ అండ్ సన్స్'..

తమిళ స్టార్ హీరో సూర్య తన కెరీర్‌లో తొలిసారిగా 'విశ్వనాథ్ అండ్ సన్స్'తో పూర్తి స్థాయి తెలుగు చిత్రంలో నటిస్తున్న విషయం తెలిసిందే. వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ మూవీలో మమితా బైజు హీరోయిన్ కాగా.. రవీనా టాండన్, రాధికా శరత్‌కుమార్ కీలక పాత్రల్లో కనిపించను న్నారు. తాజాగా ఈ సినిమా విడుదల తేదీని ఫిక్స్ చేస్తూ అధికారిక ప్రకటన రిలీజ్ చేశారు మేకర్స్. 'ప్రియమైన అభిమానులారా.. ఈ వేడుకలను ఇలాగే కొనసాగించడానికి మా దగ్గర అదిరిపోయే అప్డేట్ ఉన్నది. విశ్వనాథ్ అండ్ సన్స్ కోసం దారి ఇవ్వండి.. ఆగస్టు 14, 2026న ప్రపంచవ్యాప్తంగా ఉన్న థియేటర్లను జయించడానికి వస్తున్నారు' అంటూ అదిరిపోయే పోస్టర్‌ను షేర్ చేశారు. విడుదల చేసిన పోస్టర్‌లో సూర్య చేతిలో గొడుగు, ఫోన్ పట్టుకుని సీరియస్ అండ్ స్టైలిష్ లుక్‌లో కనిపిస్తూ ఫ్యాన్స్‌ను ఫిదా చేస్తున్నాడు. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం, అలాగే వీకెండ్స్ కావడంతో ఈ సెలవులు సినిమా సక్సెస్‌కు మరింత ప్లెస్ అయ్యే అవకాశం ఉన్నట్లు ఖుష్ అవుతున్నారు అభిమానులు. ఇప్పటికే ఇందులో నుంచి వచ్చిన అప్డేట్స్ ఆకట్టుకోవడంతో పాటు.. తెలుగులో సూర్య మొదటి చిత్రం కావడంతో ఫ్యాన్స్‌తో పాటు ప్రేక్షకుల్లో కూడా 'విశ్వనాథ్ అండ్ సన్స్'పై భారీ అంచనాలు ఉన్నాయి. కాగా.. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి.



# 'ఎల్లమ్మ' కోసం యంగ్ సెన్సేషన్?

'బలగం' వంటి బ్లాక్‌బస్టర్ సినిమాతో జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు వేణు యెల్దండి తెరకెక్కిస్తున్న లేటెస్ట్ ప్రాజెక్ట్ 'ఎల్లమ్మ'. రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్ ఈ చిత్రంతో హీరోగా పరిచయం అవుతున్నాడు. దీంతో టాలీవుడ్‌లో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. దిల్ రాజు ఈ సినిమాను ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. అయితే, ఈ సినిమాలో హీరోయిన్ మాత్రం ఇంకా ఫైనల్ కాలేదు. గతంలో పలువురు ముద్దుగుమ్మల పేర్లు వినిపించగా.. కీర్తి సురేష్ ఆల్మోస్ట్ ఫైనల్ అయిందని అన్నారు. ఇటీవల మృణాల్ ఠాకూర్‌ను సంప్రదించినట్లు వార్తలు వచ్చాయి. 'సీతారామం', 'హాయ్ నాన్న' చిత్రాలతో తెలుగులో మంచి గుర్తింపు తెచ్చుకున్న మృణాల్.. ఈ ఎమోషనల్ రోల్‌కు పర్‌ఫెక్ట్‌గా సెట్ అవుతుందని మేకర్స్ భావించారు. దీనిపై ఆమెతో చర్చలు కూడా జరిగాయని అన్నారు. కానీ ఇప్పుడు ఈ ప్రెస్టేజీయస్ ప్రాజెక్ట్‌లో యంగ్ సెన్సేషన్ మమితా బైజు పేరు వినిపిస్తోంది. 'ప్రేమలు' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన ఈ యంగ్ బ్యూటీ.. ప్రస్తుతం వరుస ప్రాజక్ట్‌స్‌తో దూసుకుపోతోంది. ఈ నేపథ్యంలో.. ఎల్లమ్మలో మమిత ఛాన్స్ దక్కించుకున్నట్టుగా సమాచారం. ప్రస్తుతానికి మేకర్స్ ఆమెతో సంప్రదింపులు జరుపుతున్నట్లు టాక్. ఒకవేళ అంతా అనుకున్నట్లు జరిగితే, డీఎస్‌పీ సరసన మమితా బైజు జోడీ కట్టడం ఖాయంగా కనిపిస్తోంది. ఈ క్రేజీ కాంబినేషన్‌పై త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతానికి మాత్రం ఎల్లమ్మ ఎవరు అనేది సస్పెన్స్‌లోనే ఉంది.



# వారణాసి కోసం మహేష్ భారీ రిస్క్.. ఏకంగా నెల రోజుల పాటు నరకమే !

ప్రిన్స్ మహేష్ బాబు లేటెస్ట్ గా నటిస్తున్న సినిమా వారణాసి. రాజమౌళి దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కుతోంది. పాన్ ఇండియా రేంజ్ లో వస్తున్న ఈ మూవీ.. టైం ట్రావెల్, మైథాలజీ కాన్సెప్ట్ తో వస్తున్నట్లు టాక్ నడుస్తోంది. ఈ సినిమాలో మహేష్ బాబు రుద్ర అనే శివ భక్తుడి పాత్రలో మెరువనున్నారు. ఇప్పటికే ఈ సినిమా టైటిల్ టీజర్ రిలీజ్ కాగా, అందరినీ ఆకట్టుకుంది. ప్రస్తుతం శరావేగంగా ఈ సినిమా షూటింగ్ జరుగుతోంది.

ఇలాంటి క్రమంలో ఈ మూవీ నుంచి అదిరిపోయే అప్డేట్ వచ్చేసింది. ఈ సినిమా షూటింగ్ లో భాగంగా వచ్చే నెల మొదటి వారం నుంచి ఓ యాక్షన్ షెడ్యూల్ ప్రారంభం కాబోతుందట. ఈ 30 రోజుల పాటు నాన్ స్టాప్ గా యాక్షన్స్ షూట్ జరగనున్నట్లు టాక్ నడుస్తోంది. ప్రతిరోజు మహేష్ బాబు హాజరు కాబోతున్నట్లు సమాచారం. అంటే ఈ నెల రోజుల పాటు మహేష్ బాబు యాక్షన్ మోడ్ లో ఉంటాడన్నమాట. ఈ యాక్షన్ సీన్ సినిమాకు హైలెట్ గా నిలుస్తుందని కూడా అంటున్నారు. దీంతో మహేష్ బాబు ఫ్యాన్స్ ఫిదా అయిపోతున్నారు.

# ఫ్యాన్స్ వార్ సృష్టించడం వల్ల జరిగేదేం ఉండదు..

సెలబ్రిటీలకు ఫ్యాన్స్ ఉండటం చాలా కామన్. అయితే.. కొందరు ఫ్యాన్స్ మాత్రం మా హీరో / హీరోయిన్ గొప్పా అంటే మా వాళ్లు గొప్పా అంటూ సోషల్ మీడియాలో వార్ సృష్టిస్తుంటారు. తాజాగా ఇలాంటి సంఘటనే బాలీవుడ్ బ్యూటీ ఊర్వశి రౌతేలాకు ఎదురైంది. ఏఐ ద్వారా సృష్టించిన ఓ ఫొటోలో ఐశ్వర్యరాయ్‌ను గ్లోబల్ బ్యూటీగా, ఆ తర్వాత కేటగిరిలో దీపిక పదుకొణె, ప్రియాంక చోప్రా, మాధురీ దీక్షిత్ ఉన్నారు. ఇక వాళ్ల ముందు మోకరిల్లి పాదాలు నమస్కరిస్తున్నట్లుగా నటి ఊర్వశితో పాటు ఆలియా భట్, కరీనా కపూర్, కత్రినా కైఫ్ ఉన్నారు. ప్రస్తుతం ఈ ఏఐ ఫొటో వైరల్ అవుతుండగా ఊర్వశి దానిపై ఘాటుగా స్పందించింది. ఈ మేరకు తన సోషల్ మీడియా వేదికగా ఓ పోస్ట్ షేర్ చేస్తూ.. 'ప్రతి నటికి తనకంటూ సొంత జర్నీ ఉంటుంది. ఆ జర్నీలో ఎంతో కష్టపడుతుంది. అలాంటి మహిళల్ని పోలుస్తూ ఫ్యాన్ వార్ సృష్టించడం వల్ల జరిగేది ఏం ఉండదు. అది కేవలం నెగిటివిటీని వ్యాప్తిచేయడం మాత్రమే అవుతుంది. దానికి బదులుగా టాలెంట్‌ను గుర్తించండి, వారి ఎదుగుదలను ప్రోత్సహించండి. దయతో ప్రవర్తించడం నేర్చుకోండి. ఇలా విషం చిమ్మడం ఆపేయండి' అంటూ చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఈమె పోస్ట్ వైరల్ అవుతుండగా.. తనకు సపోర్ట్‌గా నిలిస్తూ.. 'ఎవరి ప్రతిభ వాళ్లది.. ఎవరిని కించపరచొద్దు' అంటూ కామెంట్స్ చేస్తున్నారు నెటిజన్లు.



This newspaper/periodical is published by BATHULA KUMAR RAJA from PLOT 620, ROAD NO. 34, SURVEY OF INDIA AYYAPPA SOCIETY, CHANDA NAIK NAGAR, MADHAPUR, RANGAREDDY, TELANGANA - 500081. on behalf of BATHULA KUMAR RAJA, edited by BATHULA KUMAR RAJA and printed by NAGAVARAM SREENIVAS RAO at GARUDA PRINTERS, at H.NO.2-86/1, PLOT NO 26-SP, SY NO 420, SAGAR HIGH WAY, RAGANNAGUDA VILLEGE, ABDULLAPUR MANDAL, RANGAREDDY, TELANGANA - 501510.